'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 37 | సోమవారం | 21.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 37 | Monday | 21.9.2026 | Pages: 8 | Rate: 2

## నేటి నుంచి అలాట్‌మెంట్ లెటర్లు



### ఇందిరమ్మ టవర్స్‌కు ముహూర్తం ఖరారు

### ఎస్ఎంఎస్, వాట్సాప్‌తో నేరుగా లేఖలు

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టుల్లో ఎంపికైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 21 నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నారు. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా లేఖలను నేరుగా పంపిస్తారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనూ అలాట్‌మెంట్ లెటర్లు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తులు, లాటరీ ఎంపికకు సంబంధించిన ఆన్‌లైన్ సదుపాయాలు ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఎంపికైన వారు తమ మొబైల్ నంబర్‌తో పాటు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని అధికారులు సూచించారు.

- వివరాలు 2లో...

### కేటీఆర్‌కి కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయ్?

నిజాం కంటే కేసీఆర్ ఫ్యామిలీయే రిచ్ .. జన్వాడ ఫామ్‌హౌస్‌పై ఎంపీ చామల ప్రశ్నలు

- 2లో...



### ఉప ఎన్నికను ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్‌కు లేదు

ఎన్నికలొస్తే, హస్తానికి రాజకీయ నిమజ్జనం తథ్యం

ఖైరతాబాద్ బైపోల్‌పై బండి సంజయ్ హాట్ కామెంట్స్



- 2లో...



- 3లో...

### రెండు ఏటీఎంలలో రూ 15 లక్షల దోపిడీ

గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలు ధ్వంస రచన

### ఎల్ నినో కాదు.. ఎల్ కాంగో

కాంగ్రెస్ ఎంపీలపై ఆర్ఎస్‌పీ ఫైర్

- 2లో...



### ఆస్తుల లెక్కలు తేల్చేద్దామా?

**సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో జరిగిన బీఆర్ఎస్ చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్తులపై బహిరంగ సవాల్ విసిరారు. తనతో పాటు కేసీఆర్, రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు.

- వివరాలు 2లో...



## ముగింపు లేని యుద్ధం

### చావనైనా చస్తాం.. లొంగిపోం..!

### పుతిన్ ఓడినట్టా.. జెలెన్‌స్కీ గెలిచినట్టా?

రష్యాకు తలవొంచని ఉక్రెయిన్ బలగాలు

ఇంకెన్నాళ్లు పోరాడాలి.. రష్యా సైనికుల వెతలు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు లేదా?

ప్రపంచ గమనాన్ని మార్చుతున్న ఐదేళ్ల పోరాటం

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడు కొనసాగుతోంది. ప్రపంచం ఊహించిన ముగింపులన్నింటినీ తలకిందులు చేస్తోంది. ప్రపంచ సైనిక శక్తుల్లో అగ్రస్థానంలో ఉన్న రష్యా.. చిన్న దేశమైన ఉక్రెయిన్‌ను ఎందుకు పూర్తిగా ఓడించలేకపోతోంది? డ్రోన్లు, క్షిపణులు, సాంకేతికతతో ఉక్రెయిన్ ఎలా ప్రతిఘటనను కొనసాగిస్తోంది? రష్యా భారీ సైనిక శక్తికి అసలు అడ్డంకి ఎక్కడ? యుద్ధాన్ని త్వరగా ముగిస్తానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు ఎందుకు ముందుకు సాగడం లేదు? రష్యా–ఉక్రెయిన్ మధ్య భూభాగం, భద్రతా హామీలు, భవిష్యత్ సరిహద్దులపై పట్టు ఎందుకు సడలడం లేదు? ఈ పోరాటం ఇప్పుడు కేవలం రెండు దేశాల యుద్ధం కాదు. ఇంధనం, ఆహారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, రక్షణ వ్యూహాలు, డ్రోన్ యుద్ధం, అంతర్జాతీయ రాజకీయాలు.. అన్నింటినీ మార్చేస్తున్న మహాసంక్షోభం. ఒకవైపు రష్యా వెనక్కి తగ్గడం లేదు.. మరోవైపు ఉక్రెయిన్ లొంగిపోవడం లేదు.. అమెరికా రాజీ కోసం ప్రయత్నిస్తున్నా పరిష్కారం దొరకడం లేదు. మరి ఈ యుద్ధం ఇంకెన్నాళ్లు? అసలు ఎవరి వ్యూహం ఎక్కడ పనిచేస్తోంది? యుద్ధరంగం నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వరకు.. తెర వెనుక నడుస్తున్న అసలు పోరాటం ఏమిటి?

- వివరాలు 6లో...

## నాగేందర్ మేకపోతు గాంభీర్యం



### ఉపఎన్నిక ఎదుర్కోడానికి లేదు ధైర్యం

తెలంగాణ రాజకీయాల్లో కొత్త లెక్కలు తెరపైకి వచ్చాయి! హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే పదవి కోల్పోయిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కసారిగా సుప్రీంకోర్టు గడప ఎందుకు తొక్కాల్సి వచ్చింది? నిన్నటి వరకు "ఎన్నికలు వస్తే ఎదుర్కొంటా.. గెలిచి తీరుతా" అన్న నాయకుడు.. మరుసటి రోజే న్యాయపోరాటానికి ఎందుకు దిగారు? ఉపఎన్నిక వస్తే నిజంగానే దానం నాగేందర్‌కు రాజకీయంగా గట్టి సవాలేనా? ఖైరతాబాద్‌లో గెలుపుపై ఆయనకు పూర్తి ధీమా లేదా? లేక ఎమ్మెల్యే పదవి మాత్రమే కాదు.. తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకే సుప్రీంకోర్టు తలుపు తట్టారా? దానం రాజకీయ ప్రయాణాన్ని వెనక్కి తిప్పి చూస్తే పార్టీలు మారిన ప్రతిసారీ అధికార సమీకరణాలకు అనుగుణంగా ఆయన అడుగులు మారిన తీరు కనిపిస్తుంది. టీడీపీ నుంచి కాంగ్రెస్.. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్.. మళ్లీ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్.. ఇప్పుడు అదే రాజకీయ ప్రయాణం ఆయనను మరో కీలక మలుపు వద్ద నిలిపిందా? స్పీకర్ నిర్ణయం, హైకోర్టు తీర్పు, సుప్రీంకోర్టులో కేవియట్లు.. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక.. బీఆర్ఎస్ ప్రతిదాడి.. బీజేపీ వ్యూహం.. పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేరు.. చింతల రామచంద్రారెడ్డి చర్చ.. వీటన్నింటి మధ్య కొత్త తరానికి చెందిన జెన్‌జీ నాయకుడు బరిలోకి వస్తే లెక్కలు మారుతాయా? అసలు దానం నాగేందర్ సుప్రీం కోర్టుకు వెళ్లడం వెనుక అసలు రాజకీయ లెక్కేంటి? ఖైరతాబాద్‌లో జరగబోయేది ఉపఎన్నికేనా.. లేక తెలంగాణ రాజకీయాల్లో మరో పెద్ద మలుపా?

- వివరాలు 5లో...

### దళితుల భూములకు పూర్తి రక్షణ



అంగుళం భూమి కూడా తీసుకోం

రెవిన్యూ మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



### బహుజనుల బాణాన్ని నేను

**కోస్గి వేదికగా కవిత సవాళ్లు**

కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో జరిగిన పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు.

- వివరాలు 2లో...

### డివైడర్‌ను ఢీకొని కారు మంటల్లో

### న్యూరో సర్జన్ మృతి

**సీసీటీవీలో ప్రమాద దృశ్యాలు**



తెలంగాణలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం కలచివేసింది. సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి సమీపంలో సూర్యాపేట–ఖమ్మం హైవేపై ఆది వారం ఉదయం 7.15 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మంలోని మమతా ఆస్పత్రిలో పనిచేస్తున్న 50 ఏళ్ల న్యూరోసర్జన్ కసకుర్తి జగదీశ్ వోల్వో కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు కుటుంబాన్ని కలిసేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వేగంగా వస్తు న్న కారు ఒక్కసారిగా ఎడమవైపు మళ్లి, పలు లేన్లను దాటి రహదారి పక్కనున్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది.

- వివరాలు 2లో...

### ఉక్రెయిన్ భీకరదాడి

ఎన్నికల వేళ కలకలం

మాస్కోపై డ్రోన్లతో దండయాత్ర



రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు మాస్కోపై భారీ డ్రోన్ దాడి కలకలం రేపింది. రష్యా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మాస్కో పరిసర ప్రాంతాలపైకి వచ్చిన 1,600కు పైగా డ్రోన్లను కూల్చివేశారు. ఇందులో దాదాపు 450 డ్రోన్లు నేరుగా మాస్కోను లక్ష్యంగా చేసుకు న్నాయని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా.. పలువురు గాయపడ్డారు.

- వివరాలు 3లో...

### దీపాలు వెలిగించడానికి డబ్బులున్నాయ్?

బాలికలకు హాస్టళ్లు మాత్రం ఉండవా?

ప్రధాని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు




ఇండోర్‌లో నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థిని చెప్పిన సమస్యను రాహుల్ గాంధీ తెరపైకి తెచ్చారు. గ్రామం నుంచి నగరానికి చదువుకోవడానికి వచ్చిన ఆ యువతికి హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో పీజీలో ఉండాల్సి వస్తోందని చెప్పారు. సురక్షితంగా ఉండేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని, ప్రతి నెలా అద్దె చెల్లించాలనే ఆందోళనతో చదువుపై దృష్టి పెట్టాల్సి వస్తోందని వివరించారు.

- వివరాలు 3లో...

## దళితుల భూములకు పూర్తి రక్షణ

**అంగుళం భూమి కూడా తీసుకోం**

**రెవిన్యూ మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**



దళితులు, గిరిజనుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. దళితుల అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వేలు, రీ-సర్వేలు ప్రజల భూములు లాక్కోవడానికి కాదని, హక్కులను స్పష్టంగా నమోదు చేసి వివాదాలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల ప్రాంతాలతో పాటు మహబూబాబాద్ జిల్లా నారాయణపురంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.

### విషప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి

కాంగ్రెస్ ప్రభుత్వాలకు భూ సంస్కరణలు, పేదలకు భూముల పంపిణీ చరిత్ర ఉందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాలు పంపిణీ చేసినట్లు, గిరిజనులకు దాదాపు 2 లక్షల ఎకరాల పోడు భూములపై హక్కులు కల్పించినట్లు తెలిపారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల్లో భయాందోళనలు సృష్టిస్తూ విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. చట్టబద్ధంగా, పారదర్శకంగా భూ హక్కులను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆయన విమర్శించారు.

# నేటి నుంచి అలాట్‌మెంట్ లెటర్లు

## ఇందిరమ్మ టవర్స్‌కు ముహూర్తం ఖరారు

## ఎస్ఎంఎస్, వాట్సాప్‌తో నేరుగా లేఖలు



ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టుల్లో ఎంపికైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 21 నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నారు. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా లేఖలను నేరుగా పంపిస్తారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనూ అలాట్‌మెంట్ లెటర్లు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తులు, లాటరీ ఎంపికకు సంబంధించిన ఆన్‌లైన్ సదుపాయాలు ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఎంపికైన వారు తమ మొబైల్ నంబర్‌తో పాటు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని అధికారులు సూచించారు.

### రాయదుర్గంలో 480 ఫ్లాట్ల నిర్మాణం

అదే రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక సుమారు 2.85 ఎకరాల ప్రభుత్వ, తెలంగాణ హౌసింగ్ బోర్డు భూమిలో 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో 480 ఫ్లాట్లు నిర్మించనున్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారు రూ.6 లక్షలు చెల్లించాలి. ప్రభుత్వం ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల సబ్సిడీతో పాటు భూమి వ్యయాన్ని పూర్తిగా భరిస్తోంది.

### విలువైన ప్రాంతంలో అందుబాటు గృహాలు

రాయదుర్గం-నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో భూముల విలువలు భారీగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆగస్టు టీజీఐఐసీ ఈ-వేలాల్లో సమీప భూములు ఎకరాకు రూ. 264 కోట్లు, 269 కోట్లకు అమ్ముడయ్యాయి. ఈ ప్రమాణంతో ప్రాజెక్టు భూమి విలువ సుమారు రూ.752-767 కోట్లుగా అంచనా. సాధారణ మార్కెట్‌లో ఫ్లాట్ విలువ సుమారు 50 లక్షలు ఉన్నా, లబ్ధిదారులకు 6లక్షలకే ఫ్లాట్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ 21న మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి అలాటీలు కుటుంబాలతో హాజరుకావాలని హౌసింగ్ బోర్డు కోరింది.

## ఎల్ నినో కాదు.. ఎల్ కాంగో

**కాంగ్రెస్ ఎంపీలపై ఆర్ఎస్‌పీ ఫైర్**



బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ ఎంపీలపై తీవ్ర విమర్శలు చేశారు. అజీజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు సంబంధించిన ఆస్తుల ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పరిశీలించడాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రైవేట్ ఆస్తులపైకి వెళ్లడం ఎంపీల పని కాదని, భూ ఆరోపణలపై అధికారుల ద్వారా చట్టబద్ధంగా విచారణ జరిపించాలని సూచించారు. భూముల సర్వే, రెవెన్యూ, పోలీస్ శాఖలకు బాధ్యతలు ఉన్నప్పుడు ఎంపీలు ఫీల్డ్ విజిట్‌ల పేరుతో రాజకీయ కార్యక్రమాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 22-ఏ జాబితా, పేదల భూములు, రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మహేశ్వరం ప్రాంత రైతులు తమ భూ హక్కుల సమస్యలతో తెలంగాణ భవన్‌ను ఆశ్రయించారని తెలిపారు.

22-ఏలో ఉన్న భూములపై పారదర్శకంగా సమీక్ష జరిపి అర్హులైన వారికి హక్కులు కల్పించాలని కోరారు. ప్రకృతి కారణాల కంటే ప్రభుత్వ విధానాల వల్లే తెలంగాణ ప్రజలు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. దీనిని ఆయన రాజకీయంగా "ఎల్ కాంగో"గా అభివర్ణించారు. భూముల సమస్యలు, రైతుల కష్టాలు, నిరుద్యోగం, ధరలు, శాంతిభద్రతల అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటోందని ఆరోపించారు.

# ఉప ఎన్నికను ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్‌కు లేదు



**ఎన్నికలొస్తే, హస్తానికి రాజకీయ నిమజ్జనం తథ్యం**

**ఖైరతాబాద్ బైపోల్‌పై బండి సంజయ్ హాట్ కామెంట్స్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖైరతాబాద్ ఉప ఎన్నికపై కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఉప ఎన్నికను ఎదుర్కొనే ధైర్యం లేకే కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిందని ఆయన ఆరోపించారు. ఎన్నికలు వస్తే కాంగ్రెస్‌కు రాజకీయంగా తీవ్ర ఎదురుదెబ్బ తప్పదని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్‌లో ప్రధాన పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, కాంగ్రెస్ తమకు పోటీ కాదని బండి సంజయ్ అన్నారు.

### ఫాంహౌస్ వ్యవహారంపై నిలదీత

కాంగ్రెస్ నేతలు ఫాంహౌస్‌లను సందర్శించడంపైనా బండి సంజయ్ ప్రశ్నలు సంధించారు. ఫాంహౌస్‌లు ఏమైనా పర్యాటక కేంద్రాలా? ప్రైవేట్ భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఆధారాలు ఉంటే ప్రభుత్వం వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఫాంహౌస్ సందర్శిస్తే అర్థం చేసుకోవచ్చని, అధికార పార్టీ నేతలు వెళ్లడం రాజకీయ డ్రామాగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

### 22-ఏ సమస్యపై న్యాయపోరాటం

రాష్ట్రంలో 22-ఏ భూముల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్యపై తగిన చర్యలు లేకపోతే అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం నేపథ్యంలో ఉప ఎన్నికపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# ఆస్తుల లెక్కలు తేల్చేద్దామా?

## సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో జరిగిన బీఆర్ఎస్ చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్తులపై బహిరంగ సవాల్ విసిరారు. తనతో పాటు కేసీఆర్, రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు వెల్లడించామని ఆయన చెప్పారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ వ్యవహారాలపై చేస్తున్న ఆరోపణలకు బదులుగా రెండు ప్రభుత్వాల హయాంలోని భూ లావాదేవీలు, ధరణి, భూభారతి వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ నేతలు న్యాయ విచారణకు సిద్ధమని ప్రకటించారు.

### కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

మోటకొండూర్ సభలో హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. రైతు బంధు, రుణమాఫీ, ఉచిత విద్యుత్, యూరియా, సాగునీరు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల విద్యుత్ అందేదని, ప్రస్తుతం కోతలు పెరిగాయని ఆరోపించారు. కృష్ణా జలాలు అందుబాటులో ఉన్నా సాగునీటి ప్రాజెక్టుల మోటార్లు పూర్తి స్థాయిలో నడపడం లేదన్నారు. 30 శాతం కమిషన్ల ఆరోపణలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు, జైలు బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత చేసిన రాజకీయ ఆరోపణలుగానే పరిగణించాలి. తాజా సభలోనూ హరీశ్‌రావు రైతుల సమస్యలు, విద్యుత్ కోతలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### ఆరు గ్యారంటీల అమలుపైనా నిలదీత

రీజినల్ రింగ్ రోడ్, మెట్రో ఫేజ్-2, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించాలని హరీశ్‌రావు కోరారు. ఆరు గ్యారంటీల అమలుపై ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని నిలదీయాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. "ఆస్తుల లెక్కలు తేల్చేందుకు సిద్ధం.. మీరు సిద్ధమా?" అంటూ రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. భూ వివాదాలపై సిట్టింగ్ జడ్జి విచారణకు సిద్ధమని హరీశ్‌రావు చేసిన సవాల్ ఇప్పటికే రాజకీయంగా ప్రధాన చర్చగా మారింది.



## మూడు రోజులు భారీ వర్షాలు

**రాష్ట్రమంతటా కురిసే ఛాన్స్**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతూ వాయుగుండంగా, తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణకు భారీ వర్షాల ముప్పు పొంచి ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ సోమవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు చేరే అవకాశం ఉంది. సెప్టెంబర్ 24న మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తర జిల్లాల్లో 50--60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఇప్పటికే కొల్లాపూర్‌లో 13.9, ఏటూరునాగారంలో 10.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# కేటీఆర్‌కి కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయ్?

**నిజాం కంటే కేసీఆర్ ఫ్యామిలీయే రిచ్ .. జన్వాడ ఫామ్‌హౌస్‌పై ఎంపీ చామల ప్రశ్నలు**



రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లో భూములను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ కుటుంబ ఆస్తులు హైదరాబాద్ నిజాం ఆస్తుల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. 2004లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లలో ఉన్న ఆస్తులతో పోలిస్తే ఇప్పుడు భారీగా ఆస్తులు ఎలా పెరిగాయో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సమీపంలోని 300 ఎకరాల అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయకుండా ఆక్రమించేందుకు ప్రయత్నించారని చామల ఆరోపించారు. అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్ ఉందని, దాని చుట్టూ గతంలో పలు రాజకీయ వివాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

### 111 జీవో భూములపై విచారణకు డిమాండ్

నీటి వనరుల పరిరక్షణ కోసం అమల్లో ఉన్న 111 జీవో పరిధిలో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ ఉందని చామల ఆరోపించారు. జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం, నాలా ఆక్రమణపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. కేటీఆర్ స్నేహితుడు ప్రదీప్‌రెడ్డికి భూములు ఎలా వచ్చాయో విచారణ జరపాలని కోరారు. ఫామ్‌హౌస్ నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా, భూముల యాజమాన్యం ఎలా మారిందన్న అంశాలపై పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో జన్వాడ ఫామ్‌హౌస్ యజమాని ప్రదీప్‌రెడ్డి అది కేటీఆర్ సొంత ఆస్తి కాదని, తనదేనని వెల్లడించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది.



## బహుజనుల బాణాన్ని నేను

**కోస్గి వేదికగా కవిత సవాళ్లు**

కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో జరిగిన పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. తాను ఎవరి బాణాన్ని కాదని, బహుజనుల బాణాన్ని, యువత యుద్ధ నినాదాన్ని అని ప్రకటించారు. అంబేద్కర్ ఆలోచనలు, జ్యోతిబా పూలే ఆత్మగౌరవం, సావిత్రిబాయి పూలే ఆశయాలతో ముందుకు సాగుతున్నానని చెప్పారు. తనకు ప్రజల ఆశీర్వాదం ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీతోనూ పోరాడతానని ప్రకటించారు. ముఖ్యమంత్రి బలవంతుడిననే ధీమాతో వ్యవహరిస్తున్నారని విమర్శించిన కవిత, ప్రజా బలంతో ఆయనను ఎదుర్కొంటామని అన్నారు. బహుజన రాజ్యం కోసం కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందే అని పిలుపునిచ్చారు.

### పాలమూరు నీళ్లపై కీలక హామీ

పాలమూరు ప్రాంతం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను ప్రస్తావిస్తూ జూరాల నుంచి నీటిని తరలించి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని కవిత ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని సాధించలేకపోతే తన పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు. యువత, బహుజనుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తామని ఆమె ప్రకటించినట్లు సభపై వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి. కోస్గి సభను తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ కార్యాచరణను విస్తరించే కీలక వేదికగా నిర్వహించింది.

# డివైడర్‌ను ఢీకొని కారు మంటల్లో న్యూరో సర్జన్ మృతి

### సీసీటీవీలో ప్రమాద దృశ్యాలు

తెలంగాణలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం కలచివేసింది. సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి సమీపంలో సూర్యాపేట-ఖమ్మం హైవేపై ఆదివారం ఉదయం 7.15 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మంలోని మమతా ఆస్పత్రిలో పనిచేస్తున్న 50 ఏళ్ల న్యూరోసర్జన్ కసకుర్తి జగదీశ్ వోల్వో కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు కుటుంబాన్ని కలిసేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వేగంగా వస్తున్న కారు ఒక్కసారిగా ఎడమవైపు మళ్లి, పలు లేన్లను దాటి రహదారి పక్కనున్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. క్షణాల్లోనే కారు భారీగా మంటల్లో చిక్కుకుంది. సీసీటీవీ దృశ్యాల్లో ప్రమాదం జరిగిన వెంటనే వాహనం మంటల్లో చిక్కుకున్న తీరు స్పష్టంగా కనిపించింది.

### నిద్రమత్తే కారణమా? దర్యాప్తు కొనసాగింపు

డివైడర్‌ను ఢీకొన్న తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో జగదీశ్‌ను రక్షించేలోపే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో డ్రైవింగ్ సమయంలో నిద్రమత్తు కారణంగా వాహనంపై నియంత్రణ కోల్పోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనాస్థలాన్ని పరిశీలించి, ప్రమాదంలో మరణించిన జగదీశ్ అవశేషాలను సేకరించింది.







# ఉక్రెయిన్ భీకర దాడి

- ఎన్నికల వేళ కలకలం
- మాస్కోపై డ్రోన్లతో దండయాత్ర

రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు మాస్కోపై భారీ డ్రోన్ దాడి కలకలం రేపింది. రష్యా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మాస్కో, పరిసర ప్రాంతాలపైకి వచ్చిన 1,600కుపైగా డ్రోన్లను కూల్చివేశారు. ఇందులో దాదాపు 450 డ్రోన్లు నేరుగా మాస్కోను లక్ష్యంగా చేసుకున్నాయని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా.. పలువురు గాయపడ్డారు.చమురు శుద్ధి కేంద్రం టార్గెట్డ్రోన్ దాడుల్లో మాస్కోలోని కీలక చమురు శుద్ధి కేంద్రం దెబ్బతింది. ఓ నివాస భవనాన్ని డ్రోన్ ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. దీంతో సుమారు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మాస్కో ప్రాంత గవర్నర్ ఆండ్రే వోరోబ్యోవ్ ప్రకారం.. వేర్వేరు ప్రాంతాల్లో 44 ఏళ్ల మహిళతో పాటు ఓ వృద్ధుడు మరణించారు. రష్యా అధికారులు ఈ దాడిని ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నంగా అభివర్ణించారు.యుద్ధ ఆర్థిక వ్యవస్థపై ఉక్రెయిన్ గురి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ దాడులను సమర్థిస్తూ.. మాస్కో ప్రాంతంలోని చమురు పరిశ్రమకు చెందిన కీలక కేంద్రం, లాజిస్టిక్స్ సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధానికి ఆర్థికంగా ఉపయోగపడే రష్యా ఇంధన మౌలిక వసతులపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో తాజా దాడి ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, రష్యా పార్లమెంటరీ ఎన్నికల్లో క్రెమ్లిన్‌కు అనుకూల పార్టీలే ప్రధానంగా పోటీలో ఉండగా.. ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాల్లోనూ ఓటింగ్ నిర్వహించారు.



# టాటా బోర్డులో తీర్మానం చెల్లదన్న ట్రస్టులు

- చంద్రశేఖరన్ పునర్నియామకంపై కొత్త వివాదం



టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ను మరోసారి నియమిస్తూ సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్టులు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ తీర్మానానికి చట్టబద్ధత లేదని స్పష్టం చేశాయి. టాటా సన్స్ లో సుమారు 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్టుల తరఫున బోర్డులో ఉన్న ఇద్దరు డైరెక్టర్ల మద్దతు తప్పనిసరిగా ఉండాలని సంస్థ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ చెబుతున్నాయని ట్రస్టులు పేర్కొన్నాయి. అయితే నోయెల్ నావల్ టాటా తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో అవసరమైన మద్దతు లభించలేదని తెలిపాయి.కాస్టింగ్ ఓటుకు అవకాశం లేదన్న వాదనబోర్డు సమావేశానికి అధ్యక్షత వహించిన స్వతంత్ర డైరెక్టర్ హరీష్ మన్వాణీ కాస్టింగ్ ఓటుతో తీర్మానాన్ని ఆమోదించడాన్ని టాటా ట్రస్టులు ప్రశ్నించాయి. సాధారణంగా మొత్తం బోర్డు ఓట్లలో సమాన పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే కాస్టింగ్ ఓటు ఉపయోగించవచ్చని పేర్కొన్నాయి. ట్రస్టుల తరఫున ఉన్న ఇద్దరు డైరెక్టర్లలో మెజారిటీ అంటే ఇద్దరి మద్దతేనని స్పష్టం చేశాయి. ఒకరు వ్యతిరేకించిన నేపథ్యంలో ఈ షరతు నెరవేరలేదని, అందువల్ల తీర్మానం మొదటి నుంచే చెల్లనిదని ట్రస్టులు వాదించాయి. ఇది బోర్డు డెడ్ లాక్ కాదని కూడా స్పష్టం చేశాయి.సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన ట్రస్టులుటాటా ట్రస్టులు తమ వాదనకు 2020 సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చూపించాయి. సైరస్ మిస్త్రీ తొలగింపు కేసులో ట్రస్టుల నామినీ డైరెక్టర్లకు ఉన్న ప్రత్యేక ఓటింగ్ హక్కులను టాటా సన్స్ స్వయంగా సమర్థించిందని గుర్తుచేశాయి. సుప్రీంకోర్టు కూడా ఆ హక్కులను తొలగించాలన్న వాదనను అంగీకరించలేదని పేర్కొన్నాయి. టాటా సన్స్ ఇప్పుడు అదే హక్కులను విస్మరించలేదని ట్రస్టులు చెప్పాయి. లిస్టింగ్ కోసం ప్రత్యేకంగా కొత్త కార్పొరేట్ గవర్నెన్స్ వ్యవస్థ అవసరమనే వాదనను కూడా అవి తిరస్కరించాయి. ఇప్పటికే స్వతంత్ర డైరెక్టర్లు, ఆడిట్ కమిటీ, నామినేషన్ కమిటీ, సంబంధిత లావాదేవీల నిబంధనలు వంటి పబ్లిక్ కంపెనీ ప్రమాణాలను టాటా సన్స్ చాలాకాలంగా పాటిస్తోందని తెలిపాయి.

# రాజకీయాల్లో ఓర్పే విజయానికి బాట: లావు

పిడుగురాళ్ల మార్కెట్‌యార్డులో నిర్వహించిన అభినందన సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాలకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో ప్రజాసేవ, నిబద్ధతతో పాటు ఓర్పు, క్రమశిక్షణ అత్యంత అవసరమని ఆయన అన్నారు. 1999లో మరో పదేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన వర్ల రామయ్య, దాదాపు 27 ఏళ్ల పాటు పార్టీ కోసం పనిచేసి 2026లో ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన కుమారుడు కుమార్ రాజా కూడా క్రమశిక్షణతో పనిచేసి ఎమ్మెల్యేగా గెలిచారని పేర్కొన్నారు. తొందరపడకుండా నిలకడగా పనిచేసేవారికే రాజకీయాల్లో భవిష్యత్ ఉంటుందని యువతకు సూచించారు. ఈ సత్కార సభను గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రామయ్య కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సభను ఘనంగా నిర్వహించిన ఎరపతినేనికి ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 2 ఏటీఎంలలో రూ 15 లక్షల దోపిడీ

- గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలు ధ్వంస రచన




కరీంనగర్ జిల్లాలో ఆదివారం తెల్లవారు జామున దొంగలు రెండు ఎస్‌బీఐ ఏటీఎంలను పగులగొట్టి సుమారు రూ.15.13 లక్షలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్షాడ్, తిమ్మాపూర్ మండలంలో ఈ ఘటనలు జరిగాయి. మూడు నుంచి నలుగురు సభ్యుల ముఠా ఈ దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తిమ్మాపూర్ ఏటీఎంలో రాత్రి ఒంటిగంట సమయంలో ప్రవేశించిన దుండగులు గ్యాస్ కట్టర్లతో యంత్రాన్ని తెరిచి సుమారు రూ.8 లక్షలు దోచుకున్నారు. అనంతరం దుర్షాడ్ చేరుకుని అక్కడి ఏటీఎంను ధ్వంసం చేసి రూ.7.13 లక్షలు తీసుకెళ్లారు. అక్కడి సీసీటీవీ దృశ్యాల్లో మహిళల దుస్తుల్లో ఉన్న వ్యక్తి ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు.స్కార్పియోలో పరారీ.. దర్యాప్తు వేగంరెండు ఘటనలకు దాదాపు గంట వ్యవధి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దుర్షాడ్ ఏటీఎంలో దొంగతనం తెల్లవారుజామున 3.34 గంటలకు జరిగినట్లు గుర్తించారు. అనంతరం నిందితులు స్కార్పియో వాహనంలో పెద్దపల్లి వైపు పారిపోయినట్లు సమాచారం. ఉదయం వాకింగ్‌కు వచ్చిన స్థానికులు ధ్వంసమైన ఏటీఎంలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్‌లు ఘటనాస్థలాల్లో ఆధారాలు సేకరించాయి. ముఠా మరో రాష్ట్రం నుంచి వచ్చి ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రకృతి సంరక్షణతోనే అభివృద్ధి

- వేస్టేజ్ నుంచి ఎనర్జీ ఉత్పత్తి చేయాలి
- ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో చంద్రబాబు



బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో ది ఎర్త్ సెంటర్ ను కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తో కలిసి ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, అభివృద్ధి ప్రకృతికి అనుకూలంగా సాగాల్సిన అవసరాన్ని వివరించారు. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణహిత నిర్మాణాల వైపు మారాలని సూచించారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్, సర్క్యులర్, రీజెనరేటివ్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని కలిపి నిర్మించిన ఎర్త్ సెంటర్ ఇందుకు ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు. రీసైకిల్ పదార్థాల వినియోగం, సుస్థిర నిర్మాణ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. అభివృద్ధి ఆగకూడదని.. అదే సమయంలో పర్యావరణానికి గాయం చేయకూడదని స్పష్టం చేశారు.ప్రతి భవనం ఒక వనరుగా మారాలివాతావరణ మార్పుల ప్రభావం భవిష్యత్తు సమస్య కాదని, ఇప్పటికే ఎదుర్కొంటున్న సవాలని చంద్రబాబు అన్నారు. భవనాల్లో నెట్ జీరో విధానాలు, సోలార్ విద్యుత్, నీటి సంరక్షణ, వ్యర్థాల పునర్వినియోగాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ప్రతి పైకప్పు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని, వ్యర్థాలను వనరులుగా మార్చాలని చెప్పారు. వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ తరహాలో పట్టణాభివృద్ధిలోనూ ప్రకృతికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ విద్యుత్ సామర్థ్య లక్ష్యంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని, రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. అమరావతిని ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో భవిష్యత్ తరాలకు అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.



## బాబుపై డీకే శివకుమార్ ప్రశంసలు

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు తనకు వ్యక్తిగతంగా ఎంతో ముఖ్యమైన వ్యక్తి అని శివకుమార్ పేర్కొన్నారు. భారతదేశానికి గొప్ప నాయకుడిగా చంద్రబాబుకు తన జీవితంలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఆదివారం బెంగళూరులో జరిగిన 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో చంద్రబాబుతో కలిసి పాల్గొన్న సందర్భంగా శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ రాజకీయాలు, పరిపాలనలో చంద్రబాబు అనుభవానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్న భావాన్ని ఆయన వ్యక్తం చేశారు. బెంగళూరు పర్యటనలో భాగంగా వైట్ ఫీల్డ్ లోని అత్యాధునిక కమర్షియల్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ముఖ్యమంత్రులు వేదికను పంచుకున్నారు.

# నిజాం తరహాలో కేసీఆర్, రేవంత్ పాలన

- బీజేపీ ఎంపీ రఘునందన్ విమర్శలు



కేసీఆర్, రేవంత్ రెడ్డి పాలనపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలను పీడించిన నిజాం పాలన తరహాలోనే ఇద్దరి పాలన సాగుతోందని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు నాటకాలు ఆడాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో నిజాం పాలనపై కేసీఆర్, రేవంత్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. నిజాం పాలనలో జరిగిన దారుణాలను విస్మరించి ఆయనను ఎలా ప్రశంసిస్తారని ప్రశ్నించారు. బైరాన్ పల్లి ఘటన, ఆదివాసీలపై జరిగిన అణచివేతలను ప్రస్తావించారు. కొమురం భీమ్, రాంజీ గోండు, రామానంద తీర్థ వంటి వారి పోరాటాలను గుర్తుచేశారు.ఎంఐఎం అంశంపైనా ఘాటు వ్యాఖ్యలుకేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఎంఐఎంకు అనుకూలంగా మాట్లాడుతున్నారని రఘునందన్ ఆరోపించారు. ఓల్డ్ సిటీలో ఎంఐఎంను పొగుడుతూ, అసెంబ్లీలో మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికార, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి పరస్పరం ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నాయని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. భూముల రికార్డులన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడు క్షేత్రస్థాయి పర్యటనల అవసరం ఏమిటని నిలదీశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్ కు గతంలో ఉప ఎన్నికలు కలిసిరాలేదని వ్యాఖ్యానించారు.



## గజ వాహనంపై మలయప్పస్వామి వైభవం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శ్రీ మలయప్పస్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంగరంగ వైభవంగా సాగిన ఈ వాహన సేవలో స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవింద నామస్మరణలతో తిరుమల వీధులు మార్మోగాయి. వాహన సేవ సందర్భంగా వివిధ కళా బృందాలు నిర్వహించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఐశ్వర్యానికి ప్రతీకగా గజ వాహనంహిందూ సంప్రదాయంలో ఏనుగు ఐశ్వర్యానికి ప్రతీకగా భావిస్తారు. గజ వాహనంపై మలయప్పస్వామిని దర్శించుకోవడం వల్ల భోగభాగ్యాలు కలుగుతాయని పండితులు తెలిపారు. శ్రీనివారు తన సార్వభౌమత్వాన్ని చాటేందుకు గజ వాహనంపై ఊరేగుతారని పేర్కొన్నారు. గజ వాహన సేవలో స్వామివారి అలంకరణ, వాహన వైభవం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి వాహన సేవకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉండగా.. గజ వాహన సేవ భక్తుల్లో భక్తిభావాన్ని మరింత పెంచింది. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనంతో పులకించిపోయారు.




# దీపాలు వెలిగించడానికి డబ్బులున్నాయ్?

## బాలికలకు హాస్టళ్లు మాత్రం ఉండవా?

- ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు

ఇండోర్ లో నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థిని చెప్పిన సమస్యను రాహుల్ గాంధీ తెరపైకి తెచ్చారు. గ్రామం నుంచి నగరానికి చదువుకోవడానికి వచ్చిన ఆ యువతికి హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో పీజీలో ఉండాల్సి వస్తోందని చెప్పారు. సురక్షితంగా ఉండేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని, ప్రతి నెలా అద్దె చెల్లించాలనే ఆందోళనతో చదువుపై దృష్టి పెట్టాల్సి వస్తోందని వివరించారు. "దీపాలు వెలిగించేందుకు ప్రభుత్వానికి డబ్బుంది.. మా హాస్టళ్లకు ఎందుకు లేదు?" అని ఆ విద్యార్థిని అడిగిన ప్రశ్నను రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ ముందుంచారు.వసతి భారం.. చదువుకు అడ్డంకిహాస్టల్ సదుపాయం లేకపోవడం వల్ల అనేక మంది బాలికలు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులకు అందుతున్న హౌసింగ్ అలవెన్స్ ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగడం లేదని ఆరోపించారు. ఆ సాయం కూడా అవినీతికి గురవుతోందని పేర్కొంటూ.. విద్యార్థిని లేవనెత్తిన ప్రశ్నకు ప్రధాని సమాధానం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేరా కూడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. యువత విద్యకు అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, శిక్షణ, హాస్టళ్లు, ఉద్యోగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని వ్యాఖ్యానించారు.'వ్యవస్థ'పై రాహుల్ తీవ్ర ఆరోపణలు'ఛాత్రోంకీ గూంజ్' ఐదో ఎడిషన్లో రాహుల్ గాంధీ 'వ్యవస్థ వర్సెస్ విద్యార్థులు' అనే అంశంపై మాట్లాడారు. విద్య, నియామకాలు, పరీక్షలు, ఉపాధి వంటి అంశాలపై యువతతో చర్చించా రు. విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని, అధికారాన్ని నిలదీస్తారని.. అందుకే వారిని వ్యవస్థ భయపడుతోందని ఆరోపించారు. విద్యా వ్యవస్థతో పాటు దేశ రాజకీయ, సంస్థాగత, ఆర్థిక వ్యవస్థలపై కూడా ఆయన విమర్శలు చేశారు. మోదీ, అమిత్ షా, దోభాల్, భగవత్, గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను ప్రస్తావిస్తూ.. విద్యార్థుల ప్రశ్నించే స్వభావమే మార్పుకు సవాలుగా నిలుస్తోందని రాహుల్ పేర్కొన్నారు.

# డిస్నీల్యాండ్ భూములపై పోరు



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని డిస్నీల్యాండ్ 57 ఎకరాలు, రైల్వేకు చెందిన 20 ఎకరాలు, చెత్త ఫ్యాక్టరీకి చెందిన 30 ఎకరాలు కలిపి 100 ఎకరాలకు పైగా భూములను పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని సీపీఎం డిమాండ్ చేసింది. పార్టీ ఆధ్వర్యంలో పేదలు, కార్యకర్తలు డిస్నీల్యాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడికి ప్రవేశించి జెండాలు పాతారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పేదలకు స్థలాలు ఇవ్వకుండా 15 అంతస్తుల టిడ్కో ఇళ్ల ప్రతిపాదన చేయడం సరికాదని విమర్శించారు. జక్కంపూడిలో తొమ్మిదేళ్ల క్రితం నిర్మించిన టిడ్కో ఇళ్లు పూర్తికాకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కేటాయించేందుకు ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తే, పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఎందుకు వినియోగించరని బాబురావు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ఎన్నికలలోపే రెండు సెంట్ల స్థలాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పేదలే డిస్నీల్యాండ్ భూముల్లో గుడిసెలు వేసుకుంటారని హెచ్చరించారు.



# స్వర్ణరథంపై శ్రీ మలయప్ప దివ్య విహారం

తిరుమాడ వీధులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు అత్యంత వైభవంగా అలంకరించిన స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తిశ్రద్ధల మధ్య మహిళా భక్తులు స్వర్ణరథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ పవిత్ర ఊరేగింపు తిరుమాడ వీధుల్లో ఆధ్యాత్మిక శోభను నింపింది. స్వామివారి స్వర్ణరథ సేవను తిలకించిన భక్తులు గోవిందా.. గోవిందా అంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

## ఘనంగా రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు



వేంపల్లిలో టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేంపల్లి టీడీపీ పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రఘునాథరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంతో సందడి వాతావరణం నెలకొంది. రఘునాథరెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భద్ర, రాజా నాయక్, బాలకృష్ణారెడ్డి, పెద్దయ్య, జబీవుల్లా, చలపతి, వెంకటరామిరెడ్డి, ఈశ్వరయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై రఘునాథరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు ఆహ్లాదకరంగా సాగాయి. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన అనంతరం పాల్గొన్నవారంతా రఘునాథరెడ్డికి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఘనంగా ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



రుద్రంగిలో ఆది శ్రీనివాస్‌కు ఘన సన్మానం నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని రుద్రంగి మండల కేంద్రంలో రిటైర్డ్ ఏడీఈ భూక్యా లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆది శ్రీనివాస్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధిగా ప్రజలకు మరింత సేవ చేయాలని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని లక్ష్మణ్ నాయక్ అభిలషించారు. కార్యక్రమంలో అభిమానులు, స్థానికులు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. ఆది శ్రీనివాస్ సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు.

## ఎరువుల డీలర్లకు డీఏఈఎస్ఐ శిక్షణ ంగ్రెస్





మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (రాజ్య సంస్కరణ ప్రతినిధి): డీఏఈఎస్ఐ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) శిక్షణ తరగతిని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఏఈఎస్ఐ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఎరువుల డీలర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ తిరుపతిరెడ్డి, డీఈఎస్ఐ కార్యక్రమం ప్రెసిడెంట్ రాంచందర్‌రావు, కేవీకే మల్యాల డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు. డీఏఈఎస్ఐ శిక్షణ పొందుతున్న ఎరువుల డీలర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభ్యర్థుల ామన్నారు. క్షేమ కార్యక్ర ని చెప్పారు. ఫల్యాలను మావేశంలో నాయకులు

యం



ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) విభాగ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుపై చర్చించారు. ఆపస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవా సమస్యలు, హక్కులు, వృత్తి గౌరవం, విద్యా ప్రమాణాల పెంపు కోసం సంఘం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ అనుబంధ సంస్థగా ఆపస్ పలు సమస్యలపై సంఘటిత పోరాటాలు నిర్వహించిందన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధించడంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరుల సహకారంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పనిచేసిన పలువురు ఆపస్ సభ్యత్వం స్వీకరించారు. సమావేశానికి ఉపాధ్యాయులు హాజరై సంఘ కార్యకలాపాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు.

# డ్రైనేజీ పనుల నిర్లక్ష్యం





- మురుగు నీటిలో బడులు
- నెల రోజులుగా ఇదే తంతు

చీరాల పట్టణంలో డ్రైనేజీ పనుల జాప్యం ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. కొత్తపేట రోడ్డులో నెల రోజులుగా కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పైపుల కొనుగోలులో జాప్యం కారణంగా గత నాలుగు రోజులుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయని చెబుతున్నారు. తవ్విన గుంతలు, మధ్యలో ఆగిపోయిన పనులతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**చర్చి రోడ్డుపై మురుగు ప్రవాహం**

శుక్రవారం కురిసిన వర్షంతో చర్చి రోడ్డులోని డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లి మురుగునీరు రహదారిపైకి చేరింది. రోడ్డంతా మురుగు నీటితో నిండిపోవడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సమీపంలోని పాఠశాల చిన్నారులకు ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. పాఠశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో మోకాళ్లలోతు మురుగునీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాలు వెళ్లే సమయంలో నీరు చిన్నారులపై పడుతుండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అంటువ్యాధుల భయంతో టెన్షన్**

రోజుల తరబడి నిలిచిన మురుగునీటితో దుర్వాసన, దోమల బెడద పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీటిలో నడవడం వల్ల చిన్నారులకు చర్మ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి నిలిచిపోయిన డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

## చిన్న వర్షానికే కాలేజీ రోడ్డు జలమయం



వేంపల్లి కాలేజీ రోడ్డుపై మురుగునీటి సమస్య ఏళ్లుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్డుపై నదిలా ప్రవహిస్తోంది. భారీ వర్షం కురిస్తే మోకాలి లోతు వరకు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇదే మార్గాన్ని వినియోగించాల్సి వస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, నాలుగో, ఐదో సచివాలయాలు ఇదే మార్గంలో ఉండటంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలువల పరిస్థితిని పూర్తిస్థాయిలో పరిశీలించి, మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే దుస్థితి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

## మెగా డీఎస్సీపై స్పోర్ట్స్ టీచర్ల ఫైర్

- అసత్య ప్రచారం ఆపాలంటూ డిమాండ్



డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తమ నియామకాలను రాజకీయ వివాదంగా మార్చొద్దని, తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయవద్దని వారు కోరారు. కష్టపడి క్రీడల్లో ప్రతిభ చూపి, అర్హతల ఆధారంగా ఉద్యోగాలు సాధించామని స్పష్టం చేశారు. “అబద్ధాలు వద్దు.. ఆత్మగౌరవం ముద్దు” అంటూ నినాదాలు చేశారు. తమపై వస్తున్న ఆరోపణలను సంబంధిత ధ్రువపత్రాలు, క్రీడా రికార్డులను పరిశీలించిన తర్వాతే చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ చేస్తున్నవిగా వారు పేర్కొన్న ఆరోపణలను ఉపాధ్యాయులు ఖండించారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన తమను అవమానించడం సరికాదని ఉపాధ్యాయులు అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలపై బురదజల్లే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. క్రీడల్లో సాధించిన పతకాలు, సర్టిఫికెట్లు తమ ప్రతిభకు ఆధారాలని పేర్కొన్నారు. క్రీడలను రాజకీయాలకు వేదికగా మార్చవద్దని కోరారు. తమపై వస్తున్న ప్రచారం వల్ల మానసికంగా ఇబ్బంది పడుతున్నామని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆరోపణలను నమ్మే ముందు నియామకాలకు సంబంధించిన వాస్తవాలు, అభ్యర్థుల అర్హతలను పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై రాజకీయ విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ వాదనను బహిరంగంగా వెల్లడించారు.

**పోలీస్ పోస్టులు పెంచండి: నిరుద్యోగ యువత**

కాకినాడ రూరల్‌లో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల సంఖ్యను పెంచాలని వినతిపత్రం సమర్పించారు. ఏళ్లుగా పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న తమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ నియామకాల్లో 2,050 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ అమలు చేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను దశలవారీగా భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ పోస్టుల సంఖ్య పెంచాలన్న అభ్యర్థుల విజ్ఞప్తిని పరిశీలించి సంబంధిత వర్గాలతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది క్రమపద్ధతిలో ఉద్యోగాల భర్తీ కొనసాగుతుందని స్పష్టం చేశారు

### కాంగ్రెస్ నేత నజీర్‌పై దాడి కలకలం



ప్రొద్దుటూరులో కాంగ్రెస్ నేతపై దాడి జరిగింది. ఆదివారం రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో కాంగ్రెస్ నాయకుడు నజీర్‌తో పాటు ఆయన కుమారుడు, మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోనగర్‌లో స్క్రాప్ లోడింగ్ విషయమై కొద్ది రోజుల క్రితం షాషా, నజీర్ మధ్య వివాదం జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శ్రీనివాసనగర్‌కు చెందిన కొందరు వ్యక్తులతో కలిసి వచ్చి నజీర్‌పై దాడి చేసినట్లు బాధితులు ఆరోపించారు. ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. దాడికి సంబంధించిన వివరాలను సేకరించారు. దాడికి అసలు కారణం ఏంటి? ఘటనలో పాల్గొన్నవారు ఎవరు? అనే అంశాలపై పోలీసులు విచారణ ప్రారంభించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. నిందితుల వివరాలను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. కేసు నమోదు, తదుపరి చర్యలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

### కాణిపాకం ప్రమాణానికి సుధాకర్ రెడ్డికి సవాల్



ప్రొద్దుటూరులో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, సుధాకర్ రెడ్డికి కాణిపాకం ప్రమాణం సవాల్ విసిరారు. ఆర్ట్ కాలేజీ రోడ్డులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కాణిపాకం వచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, సుధాకర్ రెడ్డి కూడా రావాలని కోరారు. కరెంట్ ఆఫీసులో పనిచేస్తున్న ఉషారాణిని వెంట తీసుకెళ్లి, టౌన్ బ్యాంకులో ఖాతా ప్రారంభించే సమయంలో ఇతరుల పేర్లు, పత్రాలతో ఇంట్రడ్యూసర్ గా సంతకం చేయలేదని ఇద్దరూ ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. టౌన్ బ్యాంకులో కోట్ల రూపాయలు డిపాజిట్ చేశానన్న సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలపై మునిరెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రజల కోసం రూ.17.50 లక్షలు డిపాజిట్ చేశారని తెలిపారు. 10వ వార్డులో గతంలో వచ్చిన మెజారిటీ, రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనుల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. టౌన్ బ్యాంకు ఖాతాలు, పాస్ బుక్ లు, ఇన్సూరెన్స్ కేసులపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### పుట్టినరోజే విషాదం

ప్రొద్దుటూరులో వినాయక నిమజ్జన వేడుకల్లో పుట్టినరోజే ఓ విద్యార్థికి విషాదంగా మారింది. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ వీధిలో జరిగిన ఘటనలో విద్యుత్ షాక్ కు గురైన డిప్లొమా విద్యార్థి సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం, వినాయక ప్రతిమ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లస్ బాక్స్ బోర్డును సందీప్ తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్న సందీప్ ను వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. విషాదకరంగా, ఆదివారమే సందీప్ పుట్టినరోజు కావడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. కుమారుడి పరిస్థితి తెలుసుకున్న తల్లి కన్నీరుమున్నీరుగా విలపించినట్లు స్థానికులు తెలిపారు.

# రష్యా ఆదాయానికి కత్తెరే లక్ష్యం

**భారత్ కు అమెరికా టారిఫ్ షాక్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన చట్టం ద్వారా రష్యా, ఇరాన్ పై ఆంక్షలను కఠినతరం చేసే అధికారం అమెరికాకు లభించింది. రష్యా చమురు కొనుగోళ్ల ద్వారా యుద్ధానికి నిధులు సమకూరుతున్నాయనే అమెరికా వాదన నేపథ్యంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై ఆర్థిక ఒత్తిడి పెంచడం దీని ప్రధాన ఉద్దేశం. ఇరాన్ పై ఆంక్షలను 2031 వరకు పొడిగించే నిబంధన కూడా ఇందులో ఉంది.భారత్ చమురుపైనే అసలు గురిచట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల తర్వాత, రష్యా నుంచి ముడి చమురు లేదా సహజ వాయువు దిగుమతి చేసే అగ్ర ఐదు దేశాల్లో ఉన్న దేశాలపై 100 శాతం వరకు టారిఫ్ విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంటుంది. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందున ఈ నిబంధన కీలకంగా మారింది. జూలై 2026లో భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా సుమారు 51 శాతానికి చేరినట్లు అందుబాటులో ఉన్న లెక్కలు సూచిస్తున్నాయి.ఎగుమతులు, ఇంధన ధరలకు దెబ్బ100 శాతం సుంకం అమలైతే అమెరికా మార్కెట్ లో భారత ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంది. గతంలో 50 శాతం టారిఫ్ సమయంలో భారత ఎగుమతులపై ఒత్తిడి కనిపించింది. కొత్త సుంకం వస్తే టెక్స్ టైల్స్, ఇంజినీరింగ్, రత్నాభరణాలు వంటి రంగాల పోటీతత్వం మరింత దెబ్బతిన వచ్చు. మరోవైపు భారత్ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గిస్తే ప్రత్యామ్నాయ సరఫరాలపై ఆధారపడాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సరఫరా మార్గాల్లో ఇబ్బందులు కొనసాగుతున్న సమయంలో ఇది చమురు ధరలు, దేశీయ ఇంధన వ్యయాలపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది.టారిఫ్ మినహాయింపుకు అవకాశంఈ సుంకాలు వెంటనే అమల్లోకి రావు. ముందుగా 30 రోజుల వ్యవధి ఉంటుంది. అనంతరం అమెరికా నిర్ణయం తీసుకోగలదు. అయితే చట్టంలో మినహాయింపుకు మార్గం ఉంది. టారిఫ్ మినహాయింపు అమెరికా జాతీయ ప్రయోజనాలకు అనుకూలమని కాంగ్రెస్కు లిఖితపూర్వకంగా ధ్రువీకరించి, కారణాలను నివేదికగా సమర్పించాలి. అలాగే రష్యా, ఉక్రెయిన్ మధ్య ఆమోదయోగ్యమైన శాంతి ఒప్పందం కుదిరి, సైనిక చర్యలు నిలిస్తే ఆంక్షల పరిస్థితిలో మార్పుకు అవకాశం ఉంటుంది.







## సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లారు?

తీర్పు వచ్చిన వెంటనే దానం నాగేందర్ మళ్లీ ఎన్నికలు వస్తే పోటీ చేస్తానని, తాను గెలుస్తానని చెప్పారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలో చన లేదని కూడా ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. హైకోర్టు తీర్పుపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే కేవియట్‌లు దాఖలు చేయడంతో దానం పిటిషన్‌పై ఆదేశాలిచ్చే ముందు తమ వాదనలు వినాలని కోరాయి. దీంతో న్యాయపోరాటం మరో దశలోకి వెళ్లింది. ఈ కేసులో అసలు న్యాయ పరమైన అంశం దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు రాతపూర్వకంగా రాజీనామా చేశారా లేదా అన్నదానికే పరిమితం కాదు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్‌లో చేరడం, కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా ఆయన స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నారా అన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. గతంలో పార్టీకి రాజీనామా లేఖ ఇవ్వకపోయినా, ఒక సభ్యుడి రాజకీయ చర్యలు పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లు నిర్ధారించడానికి ఆధారాలుగా ఉండవచ్చని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసింది. ఇదే సూత్రాన్ని దానం కేసులో పిటిషనర్లు ప్రస్తావించారు. అందువల్ల సుప్రీంకోర్టులో దానం వాదన ఎలా నిలుస్తుందన్నది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.

# నాగేండర్

ఖైరతాబాద్ రాజకీయాల్లో దానం నాగేందర్ అధ్యాయం ఇప్పుడు కీలక మలుపు తీసుకుంటోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఇదే అంశాన్ని ఆధారంగా చేసుకుని ఆయనపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. స్పీకర్ వాటిని తిరస్కరించగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది.

# మేకపోతు గాంభీర్యం

## ఉపఎన్నిక ఎదుర్కోడానికి లేదు ధైర్యం

### ఓటమి భయమా.. రాజకీయ భవిష్యత్తు కోసమా?

దానం నాగేందర్ ముందు ఇప్పుడు ప్రధానంగా రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి సుప్రీంకోర్టులో హైకోర్టు తీర్పును సవాలు చేయడం. రెండోది అనర్హత కొనసాగితే ఖైరతాబాద్ ఉపఎన్నికను ఎదుర్కోవడం. ఉపఎన్నికపై ఎన్నికల సంఘం ప్రకటనకు ఇంకా సమయం ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి సాధారణంగా ఆరు నెలల్లోపు ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. అంటే న్యాయ పరమైన పరిణామాలు త్వరగా స్పష్టమైతే ఖైరతాబాద్ ఎన్నికల ప్రక్రియ కూడా వేగం పుంజుకునే అవకాశం ఉంది. దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లడాన్ని కొందరు రాజకీయంగా ఓటమి భయంతో తీసుకున్న నిర్ణయంగా విశ్లేషిస్తున్నారు. దీంట్లో ఎలాంటి డౌట్ లేదన్న అభిప్రాయం స్పష్టంగా ఉంది. ఎన్నికలు వస్తే పోటీ చేస్తానని ఆయన స్వయంగా ప్రకటించారు. దీంతో ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఖైరతా బాద్ ఓటర్ల తీర్పుతో ముడిపడే పరిస్థితి ఏర్పడింది. న్యాయపోరాటంలో ఉపశమనం లభిస్తే ఒక లెక్క, హైకోర్టు తీర్పు కొనసాగితే మరో లెక్క. దానం నాగేందర్ రాజకీయ ప్రయాణంలో పార్టీ మార్పులు కొత్త విషయం కాదు. 2004లో టీడీపీ నుంచి గెలిచి, తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఉప ఎన్నికలో ఓడి.. మళ్లీ రాజకీయంగా చిక్కులు ఎదుర్కొన్నారు. 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచి మంత్రిగా పనిచేశారు. 2014 ఓటమి తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో 2023లో బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్‌లో గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఈ రాజకీయ ప్రయాణాన్ని ప్రత్యర్థులు అవకాశవాద రాజకీయంగా విమర్శిస్తుంటే, ఆయన అనుచరులు మాత్రం పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ నిర్ణయాలు తీసుకున్న నాయకుడిగా సమర్థిస్తారు. ఇప్పుడు ఆ గత రాజకీయ నిర్ణయాలన్నింటికీ ఖైరతాబాద్ ఉపఎన్నిక ఒక ప్రత్యక్ష రాజకీయ పరీక్షగా మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ పరిస్థితి మరోలా ఉంది. ఒకవైపు దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తు, మరోవైపు ప్రభుత్వ పనితీరు. దానం మళ్లీ పోటీ చేయాలనుకుంటే పార్టీ ఆయనకు అవకాశం ఇస్తుందా? లేక కొత్త ముఖాన్ని రంగంలోకి దింపుతుందా? అన్నది కీలకం. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఇతర ఎమ్మెల్యేలపై కూడా ఫిరాయింపు కేసులు కొనసాగుతున్నాయి. అందువల్ల దానం కేసు తర్వాత పార్టీ ఫిరాయింపుల అంశం కాంగ్రెస్‌కు రాజకీయంగా మరింత సున్నితమైన అంశంగా మారింది. మరోవైపు పీజేఆర్ కుమార్తె తనకు ఖైరతాబాద్ సీట్ ఇస్తే సునాయసంగా గెలుస్తానన్న దీమా వ్యక్తం చేస్తున్నారు. దానంపై ఉన్న నెగిటివ్ ఇమేజ్ తప్పించుకునేందుకు కాంగ్రెస్ ఏదైనా ప్రయత్నం చేస్తుందా.. లేదంటే పార్టీని నమ్ముకున్నారన్న భావనతో తిరిగి టికెట్ ఇస్తుందా అన్నది తేలాల్సి ఉంది. కానీ దానం నాగేందర్‌కు ఉపఎన్నికలో ఓడిన విషయం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని కలవరపెడుతోంది.

### బీజేపీ డైలమా.. ఖైరతాబాద్‌లో చింతలకా.. కొత్త నాయకుడికా?

ఖైరతాబాద్‌లో బీజేపీకి కూడా ఈ ఉపఎన్నిక కొత్త అవకాశాన్ని తెచ్చింది. దానం నాగేందర్ అనర్హత కేసులో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి న్యాయపోరా టంలో భాగమయ్యారు. ఇప్పుడు ఎన్నికల బరిలో పార్టీ ఎవరిని నిలబెడుతుందన్నది ఆసక్తికరంగా మారింది. చింతల రామచంద్రారెడ్డి వంటి అనుభవజ్ఞుడైన నాయకుడికి అవకాశం ఇస్తారా? లేక కొత్త తరానికి చెందిన నాయకుడిని ముందుకు తెస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ఖైరతాబాద్‌లో బీజేపీ తన నగర రాజకీయ బలాన్ని మరింత విస్తరించాలనుకుంటే అభ్యర్థి ఎంపిక అత్యంత కీలకం కానుంది. ఇదే సమయంలో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేరు కూడా ఆసక్తి కలిగిస్తోంది. హైదరాబాద్ రాజకీయాల్లో పీజేఆర్‌కు ఉన్న గుర్తింపు కారణంగా ఆయన కుటుంబానికి ప్రత్యేక రాజకీయ నేపథ్యం ఉంది. విష్ణువర్ధన్‌రెడ్డి బరిలోకి వస్తే ఖైరతాబాద్ పోటీకి మరో కోణం చేరుతుంది. దానం వ్యక్తిగత రాజకీయ అనుభవం, చింతల రాజకీయ నేపథ్యం, పీజేఆర్ కుటుంబ వారసత్వం.. ఇలా మూడు భిన్నమైన రాజకీయ శక్తులు పోటీ పడే పరిస్థితి వస్తే ఓటర్ల నిర్ణయం మరింత ఆసక్తికరంగా మారుతుంది.

### కొత్త ముఖం.. పాత నాయకులకు యువ సవాల్?

ఒక యువ నాయకుడు సంప్రదాయ రాజకీయాలకు భిన్నమైన ప్రచారంతో ముందుకు వస్తే ఖైరతాబాద్ ఎన్నికలో కొత్త చర్చ మొదలయ్యే అవకాశం ఉంది. సోషల్ మీడియా ప్రచారం, ప్రత్యక్ష ప్రజా సంబంధాలు, స్థానిక సమస్యలపై స్పష్టమైన హామీలు యువ ఓటర్లను ఆకర్షించే అంశాలుగా మారవచ్చు. అయితే ఇది కేవలం వయసు ఆధారంగా నిర్ణయించే ఎన్నిక కాదు. యువ అభ్యర్థి వస్తే యువత మొత్తం అతని వైపు వెళ్తుందనే లెక్క కంటే, కొత్త రాజకీయ భాషను ఓటర్లు ఎంతవరకు స్వీకరిస్తారన్నదే అసలు ప్రశ్న. దానం నాగేందర్, చింతల రామచంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి వంటి పరిచిత రాజకీయ ముఖాలతో పాటు కొత్త తరం నాయకుడు బరిలోకి వస్తే ఖైరతాబాద్‌లో తరాల మధ్య రాజకీయ పోటీ కనిపించవచ్చు. ఒకవైపు అనుభవం, మరోవైపు కుటుంబ రాజకీయ వారసత్వం, ఇంకోవైపు కొత్త తరపు రాజకీయ ఆలోచనలు పోటీ పడే పరిస్థితి ఏర్పడుతుంది. తెలంగాణ రాజకీయాల్లో జెన్ జీ రాజకీయ ప్రభావం ఎంతవరకు పెరుగుతుందన్నదానికి కూడా ఇది ఒక ఆసక్తికర ఉదాహరణ కావచ్చు.

### ఖైరతాబాద్‌లో తుది లెక్క ఎవరిది?

దానం నాగేందర్ అనర్హతతో ప్రారంభమైన ఖైరతాబాద్ రాజకీయ పరిణామాలు ఇప్పుడు ఒక ఎమ్మెల్యే పదవిని మించిన చర్చగా మారాయి. సుప్రీంకోర్టు నిర్ణయం ఒకవైపు, కాంగ్రెస్ వ్యూహం మరోవైపు, బీఆర్ఎస్ పునరాగమన ప్రయత్నం, బీజేపీ అభ్యర్థి ఎంపిక, చింతల రాజకీయ ప్రస్థానం, పీజేఆర్ కుటుంబ ప్రభావం, కొత్త తరం నాయకుడి అవకాశం.. ఇవన్నీ కలిసే ఈ నియోజకవర్గ రాజకీయాన్ని ప్రభావితం చేయబోతున్నాయి. ఇప్పుడు అందరి చూపు సుప్రీంకోర్టు వైపే ఉంది. దానం నాగేందర్‌కు అక్కడ ఉపశమనం లభిస్తుందా? హైకోర్టు తీర్పు కొనసాగుతుందా? ఉపఎన్నిక తప్పదా? అన్నది ముందుగా తేలాల్సి ఉంది. ఉపఎన్నిక జరిగితే దానం మళ్లీ కాంగ్రెస్ తరఫున బరిలోకి వస్తారా అన్నది మరో కీలక ప్రశ్న. ఆయనకు టికెట్ దక్కకపోతే కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు న్యాయస్థానాల్లో జరిగిన పోరాటం ఒక దశ. ఇక రాజకీయ పోరాటం మరో దశ కావచ్చు. బీఆర్ఎస్ తన పాత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని చూస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ముందుకు తెస్తుంది. బీజేపీ నగర రాజకీయాల్లో తన బలాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తుంది. కొత్త తరం నాయకుడు వస్తే జెన్ జీ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం జరుగుతుంది. కానీ చివరికి దానం నాగేందర్ భవిష్యత్తును, ఖైరతాబాద్ రాజకీయ దిశను నిర్ణయించేది కోర్టు తీర్పు తర్వాత వచ్చే ఎన్నికల తీర్పే.



### బరిలో మూడు తరహాల రాజకీయాలు.. జెన్ జీ వస్తే?

దానం నాగేందర్ అనుభవం, చింతల రామచంద్రా రెడ్డి రాజకీయ పరిచయం, పీజేఆర్ వారసత్వ నేపథ్యం.. ఈ మూడు వేర్వేరు రాజకీయ నమూనాలు. వీటికి తోడు బీజేపీ లేదా కాంగ్రెస్ కొత్త తరానికి చెందిన నాయకుడిని తెస్తే పోటీ మరింత మారవచ్చు. అందుకే ఖైరతాబాద్‌లో పార్టీ కంటే అభ్యర్థి ముఖం కూడా ఎన్నికల ఫలితంపై ప్రభావం చూపే అంశంగా మారే అవకాశం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక జరిగితే మరో ఆసక్తికర అంశం జెన్ జీ ఓటర్ల పాత్ర. నగర ప్రాంతాల్లో కొత్త తరం ఓటర్లు రాజకీయాలపై తమదైన అంచనాలతో ముందుకు వస్తున్నారు. ఉద్యోగాలు, ట్రాఫిక్, కాలుష్యం, రహదారులు, డిజిటల్ సేవలు, పారదర్శకత, నగర జీవన ప్రమాణాలు వంటి అంశాలు వారికి ప్రాధాన్యం కలిగించే అవకాశముంది. అయితే జెన్ జీ ఓటర్లు మొత్తం ఒకే విధంగా ఓటు వేస్తారని చెప్పడం మాత్రం సాధ్యం కాదు. వారి ఓటింగ్‌పై అభ్యర్థి, పార్టీ, స్థానిక సమస్యలు, కుటుంబ రాజకీయ నేపథ్యం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.

### బీఆర్ఎస్ అడుగులు ఎలా?
### పాత స్థానాన్ని తిరిగి దక్కించుకునేదెలా?

దానం నాగేందర్ అనర్హతతో బీఆర్ఎస్‌కు ఖైరతాబా ద్‌లో కొత్త అవకాశం ఏర్పడింది. 2023లో తమ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే పార్టీ మారిన తర్వాత ఇప్పుడు అదే నియోజకవర్గంలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దానం కేసులో మొదటి నుంచి బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తోంది. కౌశిక్‌రెడ్డి పిటిషన్‌తో హైకోర్టు వరకు వెళ్లడం, ఇప్పుడు సుప్రీం కోర్టులో కేవియట్ వేయడం ఆ వ్యూహంలో భాగమే. ఉపఎన్నిక జరిగితే బీఆర్ఎస్ దానిని దానం పార్టీ మార్పుపై ప్రజా తీర్పుగా చూపించే ప్రయత్నం చేయవచ్చు. అయితే బీఆర్ఎస్‌కు అసలు సవాలు అభ్యర్థి ఎంపిక. దానం నాగేందర్‌కు వ్యక్తిగతంగా ఉన్న పరిచయం, నియోజకవర్గ రాజకీయ అనుభవాన్ని ఎదుర్కొనే స్థాయి స్థానిక నాయకుడిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి వ్యక్తిగత బలం కూడా కీలకం. పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డిని బరిలోకి దింపుతారన్న ప్రచారమున్నప్పటికీ దానం నాగేందర్‌ను ఆయన నిలువరించగలరా లేదా అన్నది అనుమానమే. అదే సమయంలో మన్నె గోవర్ధన్ రెడ్డి సైతం పోటీకి సై అంటున్నట్టుగా సమాచారం. గతంలో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దాసోజు శ్రావణ్, ఇప్పుడు బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తారా అన్న చర్చ కూడా ఉంది.






# చావనైనా చస్తాం.. లొంగిపోం..

# పుతిన్ ఓడినట్టా.. జెలెన్‌స్కీ గెలిచినట్టా?

**రష్యాకు తలవొంచని ఉక్రెయిన్ బలగాలు.. ఇంకెన్నాళ్లు పోరాడాలి.. రష్యా సైనికుల వెతలు**

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు లేదా?.. ప్రపంచ గమనాన్ని మార్చుతున్న ఐదేళ్ల పోరాటం**

ఒకప్పుడు ఇది కొన్ని వారాల్లో ముగిసే యుద్ధమని ప్రపంచం భావించింది. ఇప్పుడు అదే పోరాటం ఐదో యేడు కొనసాగుతోంది. రష్యా భారీ సైనిక శక్తి.. ఉక్రెయిన్ చిన్న దేశం.. అమెరికా అపారమైన ప్రభావం.. యూరప్ భారీ మద్దతు.. అయినా యుద్ధానికి ముగింపు కనిపించడం లేదు. ఇదే రష్యా-- ఉక్రెయిన్ యుద్ధంలోని అతిపెద్ద విరుద్ధ పరిస్థితి. 2022లో రష్యా పూర్తి స్థాయి దాడి మొదలు పెట్టినప్పుడు ఉక్రెయిన్‌పై వేగంగా నియంత్రణ సాధిసుందని అంచనాలు వచ్చాయి. కానీ ఉక్రెయిన్ ఆ దాడిని ఎదుర్కొంది. తరువాత యుద్ధం భూభాగాల కోసం సాగిన దీర్ఘ పోరుగా మారింది. ఇప్పుడు ట్యాంకుల కదలికలతో పాటు డ్రోన్లు, క్షిపణులు, ఉపగ్రహ నిఘా, ఎలక్ట్రానిక్ యుద్ధం, ఏఐ ప్రధాన ఆయుధాలుగా మారాయి. 2026 సెప్టెంబరులో కూడా రష్యా-ఉక్రెయిన్ దాడులు కొనసాగుతున్నాయి. సెప్టెంబరు 20న ఉక్రెయిన్ మాస్కోపై భారీ డ్రోన్ దాడి చేసింది. రష్యా ప్రకారం వెయ్యికి పైగా డ్రోన్లను అడ్డుకుంది. మాస్కో సమీపంలోని చమురు శుద్ధి కేంద్రం దెబ్బతిన్నట్లుగా వార్తలు వచ్చాయి. అదే సమయంలో ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. అం టే యుద్ధం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాల్లో జరగడం లేదు.. ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలు, ఇంధన కేంద్రాలు, రవాణా మార్గాలు, ప్రజల జీవనంపై ప్రభావం చూపుతోంది.

### రష్యా బలం.. ఉక్రెయిన్ ప్రతిఘటన

రష్యాను వెనక్కి నెట్టడం ఉక్రెయిన్‌కు ఎందుకు సాధ్యమవుతోందన్న ప్రశ్నకు సమాధానం యుద్ధ పద్ధతిలో ఉంది. రష్యాకు పెద్ద సైన్యం, విస్తారమైన ఆయుధ నిల్వలు, భారీ సైనిక పరిశ్రమ ఉన్నాయి. ఉక్రెయిన్‌కు అంతటి వనరులు లేవు. అయినా ఉక్రెయిన్ తన భూభాగాన్ని కాపాడుకోవాలన్న బలమైన సంకల్పాన్ని సాంకేతికతతో కలిపింది. చిన్న డ్రోన్ల నుంచి దీర్ఘశ్రేణి ఆయుధాల వరకు విస్తృతంగా వినియోగిస్తోంది. రష్యా సైనిక బలగాల కదలికలను గుర్తించడం, సరఫరా మార్గాలను దెబ్బతీయడం, ఆయుధ నిల్వలను లక్ష్యంగా చేసుకోవడంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. యుద్ధరంగంలో తక్కువ ఖర్చుతో తయారయ్యే డ్రోన్ భారీ ఖర్చుతో కూడిన సైనిక వాహనాన్ని నిర్వీర్యం చేయగల పరిస్థితి ఏర్పడింది. ఇదే యుద్ధానికి కొత్త లెక్కలు నేర్పింది. మరోవైపు అమెరికా, యూరప్ దేశాల నుంచి ఉక్రెయిన్‌కు ఆయుధాలు, ఆర్థిక సహాయం, శిక్షణ, వైమానిక రక్షణ వ్యవస్థలు అందుతున్నాయి. ఉక్రెయిన్‌లోని పరిశ్రమలు కూడా యుద్ధ అవసరాలకు అనుగుణంగా మారుతున్నాయి. అయితే ఈ ప్రతిఘటనకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సైనికుల కొరత, ఆయుధాల అవసరం, వైమానిక రక్షణ వ్యవస్థలపై ఒత్తిడి, బడ్జెట్ లోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 2025 చివరి నాటికి ఉక్రెయిన్‌లో యుద్ధం వల్ల ప్రత్యక్ష నష్టం 195 బిలియన్ డాలర్లకు పైగా చేరింది. భారత రూపాయల్లో ఇది సుమారు ?17 లక్షల కోట్లకు సమానం. వచ్చే పదేళ్లలో ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి దాదాపు 588 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని ప్రపంచ బ్యాంకు అంచనా. భారత రూపాయల్లో ఇది సుమారు ?51 లక్షల కోట్లకు సమానం.

## పుతిన్ సేనలు యుద్ధ రంగంలో వెనుకడుగేస్తున్నాయా?

రష్యా యుద్ధంలో ఓడిపోయిందని చెప్పడానికి ఆధారాలు లేవు. అదే సమయంలో రష్యా ఆశించిన వేగంతో విజయం సాధించిందని కూడా చెప్పలేం. ఇదే ఈ యుద్ధంలోని ప్రధాన మలుపు. రష్యా తన భారీ సైనిక సామర్థ్యాన్ని ఉపయోగిస్తూ ఉక్రెయిన్‌పై ఒత్తిడి కొనసాగిస్తోంది. కానీ ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థ, డ్రోన్ దాడులు, పశ్చిమ దేశాల ఆయుధ సహాయం కారణంగా రష్యా ప్రతి ప్రాంతంలో వేగంగా ముందుకు సాగడం సాధ్యం కావడం లేదు. యుద్ధం పొడిగించబడుతున్న కొద్దీ రష్యాకు కూడా ఆర్థిక భారం పెరుగుతోంది. సైనిక వ్యయం పెరగడం, ఆం క్షలు, ఇంధన రంగంపై ఒత్తిడి, సైనిక సామగ్రి తయా రీ అవసరాలు రష్యా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. తాజాగా ఉక్రెయిన్, రష్యా ఇంధన వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవడం కూడా ఇదే వ్యూహం లో భాగంగా కనిపిస్తోంది. సెప్టెంబరు 20న మాస్కో ప్రాంతంలోని చమురు శుద్ధి కేంద్రం దెబ్బతినడం రష్యా ఇంధన రంగంపై ఒత్తిడి పెంచింది. రష్యా కూడా ఉక్రెయిన్ విద్యుత్, ఇంధన వ్యవస్థలను లక్ష్యం గా చేసుకుంటోంది. అంటే యుద్ధరంగంలో గెలవలేని ఒత్తిడిని ఇంధన రంగంపైకి మార్చే ప్రయత్నం ఇరువైపులా కనిపిస్తోంది. ఇదే కారణంగా యుద్ధం ఒక ప్రాంతాన్ని ఆక్రమించుకోవడం నుంచి ప్రత్యర్థి దేశ ఆర్థిక శక్తిని క్షీణింపజేసే పోరుగా మారింది. రష్యా కొత్త దాడులు చేస్తోంది.. ఉక్రెయిన్ రష్యా భూభాగంలోని కీలక లక్ష్యాలను దెబ్బతీస్తోంది. ఫలితం గా యుద్ధానికి ఒక స్పష్టమైన విజేత కనిపించని పరిస్థితి కొనసాగుతోంది.

## యుద్ధం సరిహద్దులు దాటి ప్రపంచానికి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం రెండు దేశాలకే పరిమితం కాలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రతి దేశం ఏదో ఒక రూపంలో దీని ప్రభావాన్ని అనుభ వించింది. ఇంధన ధరలు, ఆహార ధాన్యాల సరఫరా, ఎరువుల మార్కెట్, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి రంగాల్లో యుద్ధ ప్రభావం కనిపించింది. ఉక్రెయిన్ ప్రపంచంలో ముఖ్యమైన ధాన్య ఎగుమతిదారుల్లో ఒకటి. నల్ల సముద్రం ద్వారా ధాన్యం తరలింపు దెబ్బతినడంతో అనేక దేశాల్లో ఆహార భద్రతపై ఆందోళన పెరిగింది. రష్యా చమురు, గ్యాస్‌పై పశ్చిమ దేశాల ఆంక్షలు యూరప్ ఇంధన విధానాన్ని మార్చాయి. యూరప్ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం వెతకాల్సి వచ్చింది. రక్షణ ఖర్చులు పెరిగాయి. నాటో తూర్పు ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు బలోపేతం అయ్యాయి. మరోవైపు యుద్ధం ఆధునిక సైనిక సాంకేతికతకు పెద్ద ప్రయోగశాలగా మారింది. డ్రోన్ దాడులు, ఉపగ్రహ చిత్రాలు, ఎలక్ట్రానిక్ జామింగ్, ఏఐ ఆధారంగా టార్గెట్స్ ఫిక్స్ చేయడం ఇప్పుడు ప్రపంచ సైనిక వ్యూహాల్లో ముఖ్యమైన అంశాలుగా మారాయి. యుద్ధం ముగిసిన తర్వాత కూడా దీని ఆర్థిక ప్రభావం వెంటనే ముగియదు. ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ కమిషన్ అంచనా ప్రకారం ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి వచ్చే పదేళ్లలో దాదాపు 588 బిలియన్ డాలర్లు, అంటే సుమారు ?51 లక్షల కోట్లు అవసరం. రవాణా, ఇంధనం, గృహ నిర్మాణం, పరిశ్రమలు, వ్యవసాయం ప్రధాన రంగాలుగా ఉన్నాయి. అంటే శాంతి ఒప్పందం కుదిరిన రోజు యుద్ధం ముగిసినా.. యుద్ధం సృష్టించిన ఆర్థిక గాయం పునర్నిర్మాణం ద్వారానే మొదలవుతుంది.

## విలువ లేకుండా పోయిన ట్రంప్ మాట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధాన్ని త్వరగా ముగిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రష్యా -ఉక్రెయిన్ మధ్య ఒప్పందం సాధించడానికి ప్రయ త్నాలు చేశారు. కానీ అమెరికా అధ్యక్షుడి రాజకీయ సంకల్పం ఒక్కటే యుద్ధాన్ని ఆపలేని స్థితి ఎదురైంది. 2026 సెప్టెంబరులో ట్రంప్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ ముందుగా మాస్కో వెళ్లి వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చించారు. తరువాత కీవ్ వెళ్లి వొలోదిమిర్ జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. అమెరికా మళ్లీ చర్చలకు ఊపునిచ్చేందుకు ప్రయత్ని స్తున్నప్పటికీ ఇప్పటివరకు నిర్ణయాత్మక ఒప్పందం కుదరలేదు. అసలు అడ్డంకి ఏమిటంటే రష్యా కోరు తున్నది, ఉక్రెయిన్ అంగీకరించగలది ఒకటే కాదు. భూభాగం విషయంలో రష్యా డిమా ండ్లు.. భద్రతా హామీల విషయంలో ఉక్రెయిన్ పట్టు దల.. ఈ రెండింటి మధ్య దూరమే చర్చలకు ప్రధాన అడ్డంకి. రష్యా తనకు అనుకూలమైన భూభాగాలపై హక్కును వదులుకునేందుకు సిద్ధంగా ఉందనే సంకేతా లు లేవు. ఉక్రెయిన్ మాత్రం భద్రతా హామీ లేకుండా భూభాగం అప్పగిస్తే భవిష్యత్తులో మరో దాడికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. సెప్టెంబరు 8న ట్రంప్ పుతిన్‌తో మాట్లాడి యుద్ధాన్ని త్వరగా ముగిం చాలని కోరినట్లు క్రెమ్లిన్ తెలిపింది. అయినా చర్చల వేగం పెరగలేదు. సెప్టెంబరు మధ్యలో ఇరుదేశాల ఇంధన మౌలిక వసతులపై దాడులను నిలిపే ప్రతిపాదన కూడా వచ్చింది. ఉక్రెయిన్ రష్యా నిజాయితీపై స్పష్టమైన హామీ కోరింది. రష్యా ఆంక్షల సడలింపును కూడా ప్రస్తావించింది. చిన్న కాల్పుల విరమణకే ఇంతటి షరతులు ఉంటే.. శాశ్వత శాంతి ఒప్పందం ఎంత క్లిష్టమో అర్థం చేసుకోవచ్చు.

## ముగింపు తేదీ కాదు.. మారే సమీకరణం

ఇప్పుడు అసలు ప్రశ్న రష్యా గెలుస్తుందా?

ఉక్రెయిన్ గెలుస్తుందా? అనేది కాదు. ఇద్దరూ ఎంతకాలం ఇదే స్థాయిలో పోరాడగలరు? అన్నదే కీలక ప్రశ్న. రష్యాకు పెద్ద సైనిక, ఆర్థిక వనరులు ఉన్నాయి. ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాల మద్దతు, సాంకేతిక నైపుణ్యం, దేశ రక్షణపై బలమైన సంకల్పం ఉన్నాయి. ఈ రెండు శక్తులు ఒకదానిని మరొకటి పూర్తిగా అధిగమించలేకపోతున్నాయి. అందుకే యుద్ధం దీర్ఘకాల పోరుగా మారింది. 2026 సెప్టెంబరులో కూడా అమెరికా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రష్యా చర్చలకు సిద్ధమనే సంకేతాలు ఇస్తోంది. ఉక్రెయిన్ కూడా కొన్ని పరిమిత కాల్పుల విరమణ ప్రతిపాదనలను షరతులతో పరిశీలిస్తోంది. కానీ భూభాగం, భద్రత, భవిష్యత్ సైనిక హామీలు, ఆంక్షలు అనే నాలుగు అంశాల్లో పెద్ద అడ్డంకులు మిగిలే ఉన్నాయి. రష్యా కొత్త ఆంక్షలు శాంతి ఒప్పందాన్ని మరింత కష్టతరం చేస్తాయని చెబుతోంది. అమెరికా మాత్రం ఒత్తిడి, చర్చలు రెండింటినీ ఉపయోగించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తోంది. అందువల్ల యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో కచ్చితమైన తేదీ చెప్పడం సాధ్యం కాదు. కానీ ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ఇక కేవలం రష్యా--ఉక్రెయిన్ మధ్య భూభాగ యుద్ధం కాదు. ఇది సహనం, ఆర్థిక శక్తి, సాంకేతిక ఆధిపత్యం, అంతర్జాతీయ మద్దతు, రాజకీయ ఒత్తిడి మధ్య జరుగుతున్న దీర్ఘ పోరాటం. ఒకవైపు రష్యా వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు ఉక్రెయిన్ లొంగిపోవడానికి సిద్ధంగా లేదు. అమెరికా వేగంగా పరిష్కారం కోరుతున్నా, ఆ పరిష్కారాన్ని అంగీకరించే స్థితికి రెండు దేశాలు ఇంకా రాలేదు. అందుకే ప్రపంచం ఎదురుచూస్తున్నది మరో భారీ దాడి కోసం కాదు.. ఒక రాజీకి దారి తీసే ఆ క్షణం కోసం. ఆ క్షణం ఎప్పుడు వస్తుందో చెప్పలేకపోవడమే ఈ యుద్ధం అసలు విషాదం.




# ధర్మవరం గడ్డపై రీ-ఎంట్రీ..

## ఫ్యాక్షన్ ఫ్యామిలీ నుంచి ఫన్నీ ఫాలోయింగ్ దాకా..

## కేతిరెడ్డి రీ-ఎంట్రీతో ధర్మవరంలో కొత్త చర్చ

ధర్మవరం రాజకీయాల్లో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేరు ఒక సాధారణ రాజకీయ నాయకుడి పేరు కాదు. ఒకప్పుడు కుటుంబ రాజకీయ నేపథ్యం.. తర్వాత ఎమ్మెల్యే పదవి.. మధ్యలో పార్టీ మార్పు.. ఆపై భారీ మెజారిటీతో గెలుపు.. ఐదేళ్ల పాటు ఉదయం పూటే ప్రజల మధ్యకు వెళ్లే "గుడ్ మార్నింగ్ ధర్మవరం".. సోషల్ మీడియాలో ప్రత్యేకమైన ఇమేజ్.. 2024లో అతి స్వల్ప తేడాతో ఓటమి.. కొంతకాలం రాజకీయంగా నిశ్శబ్దం.. ఇప్పుడు మళ్లీ అదే "గుడ్ మార్నింగ్"తో ప్రజల తలుపు తట్టడం. ఇదంతా చూస్తే కేతిరెడ్డి కెరీర్ లో మరో అధ్యాయం మొదలైందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఈసారి ఉదయం పలకరింపుల వెనుక రాజకీయ లెక్కలు ఎంత ఉన్నాయన్నదే ధర్మవరం చర్చ. కేతిరెడ్డి కుటుంబానికి ధర్మవరం రాజకీయాలతో పాత అనుబంధమే ఉంది. ఆయన తండ్రి కేతిరెడ్డి సూర్యప్రతాపరెడ్డి కూడా ఎమ్మెల్యేగా పనిచేశారు. ధర్మవరం రాజకీయాల్లో ఆ కుటుంబానికి ఉన్న పాత పరిచయం, స్థానిక సామాజిక సమీకరణాలు, ప్రత్యర్థి రాజకీయ కుటుంబాలతో ఉన్న పోటీ.. ఇవన్నీ కేతిరెడ్డి రాజకీయ నేపథ్యానికి ఒక ప్రత్యేక కలరింగ్ ఇచ్చాయి. ఆ ప్రాంత రాజకీయ చరిత్రలో ఫ్యాక్షన్ రాజకీయాల ప్రభావం ఉన్న మాట వాస్తవమే అయినా, కేతిరెడ్డి వ్యక్తిగత రాజకీయ ప్రయాణాన్ని కేవలం ఆ ముద్రతోనే చూడటం మాత్రం పూర్తి చిత్రాన్ని ఇవ్వదు. ఎందుకంటే ఇంజనీరింగ్ చదివి, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి, హైదరాబాద్‌లో రిలయన్స్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పనిచేసిన వ్యక్తి ఆయన. తండ్రి మరణం తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన ఆయన ప్రయాణం కుటుంబ వారసత్వం నుంచి ప్రజా రాజకీయాల దిశగా సాగింది. 2009లో కాంగ్రెస్ తరఫున ధర్మవరం నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నిక కావడం ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపు. ఆ ఎన్నికల్లో కేతిరెడ్డి 61,260 ఓట్లు సాధించి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినా.. ఐదేళ్లకే సీన్ మొత్తం మార్చేశారు. 2019లో కేతిరెడ్డి 1,06,024 ఓట్లు సాధించి టీడీపీ అభ్యర్థి గొనుగుంట్ల సూర్యనారాయణపై 15,286 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. మరో ఎన్నికలో ఓడిపోయిన నాయకుడు తిరిగి వచ్చి అంతకంటే పెద్ద మెజారిటీతో గెలవడం అప్పట్లో ఆయన రాజకీయ పునరాగమనానికి బలమైన సంకేతంగా నిలిచింది. అక్కడి నుంచే "గుడ్ మార్నింగ్ ధర్మవరం" అనే బ్రాండ్ ఆయన రాజకీయ వ్యక్తిత్వానికి విడదీయరాని భాగంగా మారింది. ఉదయం లేవగానే రాజకీయ నాయకులు సాధారణంగా పార్టీ కార్యాలయాలు, అనుచరులు, సమావేశాల వైపు వెళ్తుంటే.. కేతిరెడ్డి మాత్రం వార్డులు, కాలనీలు, గ్రామాలు, ఇళ్ల తలుపుల వైపు వెళ్లేవారు. అధికారులను వెంటబెట్టుకుని ప్రజల సమస్యలు వింటూ, వీలైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా ప్రచారంలోకి వచ్చింది. అధికారిక వ్యవస్థను ప్రజల గడప దగ్గరకు తీసుకురావాలనే ఈ మోడల్ ఆయనకు విస్తృత ప్రచారం తెచ్చింది.

### ఫ్యాక్షన్ ఫ్యామిలీ నుంచి ఫన్నీ ఫాలోయింగ్ వరకు

అసలు కేతిరెడ్డి స్టైల్ అక్కడే మొదలైంది. రాజకీయ నాయకుడు అంటే తెల్లటి దుస్తులు.. సీరియస్ ముఖం.. పదునైన మాటలు అనే పాత ఫార్ములాకు బదులు రంగురంగుల టీషర్ట్.. నైట్ ప్యాంట్ తరహా క్యాజువల్ డ్రెస్.. అదే టోన్‌లో షూ.. చుట్టూ అధికారులు.. ఎదురుగా ప్రజలు.. చివర్లో ఒక పంచ్ డైలాగ్. రాజకీయ కార్యక్రమం కంటే యూట్యూబ్ వీడియోలా కనిపించే ఈ ఫార్మాట్ సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది. రాజకీయాల్లో సమస్య పరిష్కారం ఒక భాగమైతే.. దాన్ని ప్రజలకు ఎలా చూపించాలి అన్నది మరో భాగమని కేతిరెడ్డి చాలా ముందుగానే అర్థం చేసుకున్నట్టుగా కనిపించింది. ఆయనకు వచ్చిన సోషల్ మీడియా గుర్తింపు అందుకు ఉదాహరణ. ఇక్కడే కేతిరెడ్డి రాజకీయానికి ఒక విచిత్రమైన మలుపు ఉంది. ఆయనపై విమర్శలు చేసినవారికి కూడా ఆయనను పూర్తిగా విస్మరించడం కష్టమే. కారణం ఆయన రాజకీయ కమ్యూనికేషన్. ఫ్యాక్షన్ రాజకీయాల పేరుతో ఒకప్పుడు గన్‌లు, గొడవలు, గంభీరమైన ముఖాలు గుర్తొచ్చే ధర్మవరం రాజకీయాల్లో.. ఒక ఎమ్మెల్యే ఉదయం టీషర్ట్ వేసుకుని ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు అడగడం ఒక కొత్త విజువల్. "ఫ్యాక్షన్ ఫ్యామిలీ నుంచి ఫన్నీ ఫాలోయింగ్" వరకు వచ్చిన ఈ మార్పే కేతిరెడ్డి బ్రాండ్‌కు అసలు బలం. అయితే నవ్వించే పంచ్ వెనుక రాజకీయ లెక్క ఉండదని మాత్రం చెప్పలేం. రాజకీయాల్లో ప్రతి అడుగు ఏదో ఒక సందేశాన్ని మోస్తూనే ఉంటుంది. 2024 ఎన్నికలు ఆ ఇమేజ్‌కు అసలు పరీక్షగా మారాయి. కేతిరెడ్డి వైసీపీ తరఫున 1,02,810 ఓట్లు సాధించారు. బీజేపీ తరఫున పోటీ చేసిన సత్యకుమార్ యాదవ్ 1,06,544 ఓట్లు సాధించారు. తేడా కేవలం 3,734 ఓట్లు. అంటే కేతిరెడ్డి భారీ ఓటమి చవిచూశారని చెప్పే పరిస్థితి కాదు; అదే సమయంలో గెలుపు తలుపు దగ్గరికి వచ్చి కూడా ఓటమి ఎదురైందన్నది సంఖ్యలు చెబుతున్న వాస్తవం. 2.2 లక్షలకు పైగా చెల్లుబాటు అయిన ఓట్లున్న నియోజకవర్గంలో 3,734 ఓట్ల తేడా రాజకీయంగా గమనించాల్సిన అంతరం. ఈ ఓటమి తర్వాత "గుడ్ మార్నింగ్ ధర్మవరం" కూడా కనిపించకుండా పోయింది. రాజకీయాల్లో గెలిచినప్పుడు జనాల్లో కనిపించడం సహజం. ఓడిపోయిన తర్వాత కూడా అదే స్థాయిలో జనాల్లో ఉండటం మాత్రం నాయకుడి రాజకీయ సహనానికి పరీక్ష. కేతిరెడ్డి కొంతకాలం వెనక్కి తగ్గడం, ప్రజా కార్యక్రమాలు తగ్గించడం, రాజకీయంగా మౌనంగా ఉండడం ఆయన అనుచరుల్లోనే చర్చకు దారితీసింది. కొంతకాలం రాజకీయాల నుంచి దూరమవుతారన్న ప్రచారం కూడా సాగింది. అయితే రాజకీయాల్లో గ్యాప్ అంటే ఎండ్ కాదు. ముఖ్యంగా ఒక నియోజకవర్గంలో రెండు ఎన్నికల్లో గెలిచిన అనుభవం ఉన్న నాయకుడికి అది తదుపరి పోరాటానికి ముందు తీసుకున్న విరామం కావచ్చు.

### ధర్మవరంలో కేతిరెడ్డి రీబూట్.. రాజకీయ కాక

ఇప్పుడు మళ్లీ ఈనెల మొదటి వారం నుంచి "గుడ్ మార్నింగ్ ధర్మవరం" రీ-ఎంట్రీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. నాలుగో వార్డు, సీపీఐ కొట్టాలు ప్రాంతంలో చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి నేతన్న సేవ పథకం కింద రూ.25 వేల సాయం అందిందా లేదా అని ఆరా తీయడం ద్వారా ఆయన మళ్లీ పాత ఫార్ములాను బయటకు తీశారు. ఇది కేవలం ఒక కార్యక్రమమా? లేక రాజకీయంగా తిరిగి గ్రౌండ్‌లోకి అడుగుపెట్టే సంకేతమా? అన్నది ఇప్పుడు ధర్మవరం రాజకీయ వర్గాల్లో చర్చ. అధికారికంగా ఆయన ఉద్దేశం ప్రజా సమస్యలు తెలుసుకోవడమే కావచ్చు. రాజకీయంగా చూస్తే మాత్రం ఓటమి తర్వాత మళ్లీ తన పాత బలాన్ని పరీక్షించుకునే ప్రయత్నంగా దీన్ని చదివే అవకాశం ఉంది. ఎందుకంటే కేతిరెడ్డి బలం అసెంబ్లీ భవనంలో కంటే ధర్మవరం వీధుల్లో ఎక్కువగా కనిపించింది. ఆయన రాజకీయ బ్రాండ్‌కు మైక్ కంటే మొబైల్ కెమెరా, సభ కంటే ఇంటి ముంగిటి సంభాషణ, పొడవాటి ప్రసంగం కంటే రెండు నిమిషాల పంచ్ డైలాగ్ ఎక్కువ పనిచేశాయి. ఇప్పుడు మళ్లీ అదే ఫార్ములాను రీబూట్ చేయడం వెనుక "ప్రజల్లో ఉన్నాననే గుర్తు"ను తిరిగి బలపరచాలన్న ప్రయత్నం ఉండొచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ కార్యక్రమాల వేగం పెరిగితే.. దాని రాజకీయ ప్రాధాన్యం మరింత స్పష్టమవుతుంది. అయితే ఈసారి కేతిరెడ్డికి రాజకీయ పరిస్థితి 2019 నాటిదిగా లేదు. అధికారంలో వైసీపీ లేదు. ఆయన ఎమ్మెల్యే కాదు. ఎదురుగా అధికార కూటమి ఉంది. ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. 2024లో కేవలం 3,734 ఓట్ల తేడాతో గెలిచిన సత్యకుమార్‌కు వ్యతిరేకంగా కేతిరెడ్డి చేస్తున్న రాజకీయ విమర్శలు సహజంగానే ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తాయి. ముఖ్యంగా "బయటి వ్యక్తి", "స్థానిక సమస్యలు తెలియవు" వంటి వాదనలు ఆయన రాజకీయ ప్రచారంలో ప్రధాన ఆయుధాలుగా మారే అవకాశం ఉంది. అయితే సత్యకుమార్ స్థానికతపై కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ విమర్శలుగా చూడాలి; వాటిని స్వతంత్రంగా నిర్ధారించిన వాస్తవాలుగా పేర్కొనడం సరైంది కాదు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఉంది. 2024లో కేతిరెడ్డిని ఓడించిన సత్యకుమార్‌కు వచ్చిన ఓట్లు 1,06,544. 2019లో కేతిరెడ్డికి వచ్చిన ఓట్లు 1,06,024. అంటే 2019లో తన గెలుపుకు వచ్చిన దాదాపు అదే స్థాయి ఓట్లను 2024లో కేతిరెడ్డి ఓడిపోయినా సాధించారు. కానీ ప్రత్యర్థి ఓట్లు పెరగడంతో సమీకరణం మారిపోయింది. రాజకీయాల్లో ఇదే అసలు గణితం. "నా ఓట్లు తగ్గాయా?" అనేది ఒక ప్రశ్న. "ప్రత్యర్థి ఓట్లు ఎందుకు పెరిగాయి?" అనేది మరో ప్రశ్న. రెండింటికీ సమాధానం దొరికితేనే ఓటమి కారణం అర్థమవుతుంది.

### కేతిరెడ్డి ఓటుబ్యాంక్‌కు అసలు పరీక్ష మొదలు

కేతిరెడ్డి రాజకీయ కథను ఇక్కడి నుంచి మరో కోణంలో కూడా చూడాలి. 2009లో కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి.. 2014లో వైసీపీ అభ్యర్థిగా ఓడిన వ్యక్తి.. 2019లో అదే వైసీపీ నుంచి భారీ ఆధిక్యంతో గెలిచిన వ్యక్తి.. 2024లో లక్షకు పైగా ఓట్లు సాధించినప్పటికీ ఓడిపోయిన వ్యక్తి. అంటే ధర్మవరం రాజకీయాల్లో ఆయనకు స్థిరమైన ఓటు బేస్ ఉన్నప్పటికీ అది గెలుపునకు ఆటోమేటిక్ హామీ కాదన్నది ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. 2014లో ఆయనకు 85,035 ఓట్లు వచ్చాయి. 2019లో అది 1,06,024కు పెరిగింది. 2024లో 1,02,810 వద్ద నిలిచింది. సంఖ్యల్ని చూస్తే ఓటు బలం పూర్తిగా కూలిపోయిన చిత్రం కనిపించదు; కానీ గెలుపు సమీకరణ మాత్రం మారింది. అందుకే "గుడ్ మార్నింగ్" రీబూట్‌ను కేవలం ఒక కార్యక్రమంగా చూడటం కూడా తక్కువ అంచనా కావచ్చు. అది ఒక రాజకీయ కమ్యూనికేషన్ మోడల్. ప్రజలకు సమస్య చెప్పే అవకాశం.. నాయకుడికి ప్రజలతో ప్రత్యక్ష సంబంధం.. సోషల్ మీడియాకు కంటెంట్.. పార్టీకి కార్యకర్తల చైతన్యం.. ఇవన్నీ ఒకే ప్యాకేజీలో వచ్చే ఫార్ములా. ఎన్నికల రాజకీయాల్లో ఇలాంటి మోడల్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఒకప్పుడు పనిచేసిన ఫార్ములా రెండోసారి అదే ప్రభావంతో పనిచేస్తుందా అన్నది మాత్రం ప్రజల స్పందనపై ఆధారపడి ఉంటుంది. ఇంకా మరో విషయం. కేతిరెడ్డి గతంలో "గుడ్ మార్నింగ్" ద్వారా సమస్యలు పరిష్కరించినప్పుడు ఆయన చేతిలో అధికార యంత్రాంగంపై ప్రత్యక్ష రాజకీయ ప్రభావం ఉండేది. ఇప్పుడు ఆయన ప్రతిపక్ష నేత. ఫిర్యాదు తీసుకుని అధికారిని వెంటనే ఆదేశించే స్థానం లేదు. అందువల్ల ఈసారి "గుడ్ మార్నింగ్"లో అసలు పరీక్ష ఇదే. సమస్య విన్న తర్వాత పరిష్కారం ఎక్కడి నుంచి వస్తుంది? అధికారంలో లేని నాయకుడు ప్రజా సమస్యను ఎలా ఫాలోఅప్ చేస్తారు? అధికారులను ప్రశ్నించడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, ప్రజా సమస్యను రాజకీయ అంశంగా మార్చడం.. ఇవే ఇప్పుడు ఆయన కార్యక్రమానికి కొత్త అర్థాన్ని ఇస్తాయి. ఇక్కడే ఫ్యాక్షన్ రాజకీయాల పాత నీడకు ఆధునిక సోషల్ మీడియా రంగు పూసిన కేతిరెడ్డి మోడల్ కనిపిస్తుంది.

### 2029 టార్గెట్‌గా గుడ్ మార్నింగ్ కేతిరెడ్డి

2029 అసెంబ్లీ ఎన్నికల గురించి ఇప్పుడే తుది రాజకీయ లెక్కలు వేయడం తొందరే. కానీ రాజకీయ నాయకులు ఎన్నికల తేదీ ప్రకటించిన తర్వాతే రాజకీయాలు ప్రారంభించరు. నియోజకవర్గంలో కనిపించడం, కార్యకర్తలను కదిలించడం, పాత పరిచయాలను పునరుద్ధరించడం, కొత్త తరం ఓటర్లతో కనెక్ట్ అవడం ఇవన్నీ దీర్ఘకాలిక రాజకీయ కార్యకలాపాల్లో భాగమే. ఆ కోణంలో చూస్తే కేతిరెడ్డి తిరిగి "గుడ్ మార్నింగ్" చెప్పడం ఒక రాజకీయ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగమై ఉండొచ్చు. దానికి ఫలితం ఏమిటన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేం. ధర్మవరం రాజకీయాల్లో కేతిరెడ్డి అధ్యాయం ఇంకా ముగియ లేదన్నది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఓటమి ఆయన రాజకీయ బ్రాండ్‌ను పూర్తిగా చెరిపేయలేదు. 2024లో ఆయన లక్షకు పైగా ఓట్లు సాధించారు. ఇప్పుడు మళ్లీ ప్రజల మధ్యకు వస్తున్నారు. పాత "గుడ్ మార్నింగ్"ను కొత్త రాజకీయ సందేశంతో కలపాలని చూస్తున్నారు. ఒకప్పుడు ఉదయం పలకరింపుతో మొదలైన కార్యక్రమం.. ఇప్పుడు రాజకీయ పునరాగమనానికి వేదికగా మారుతుందా అన్నదే ఆసక్తి. ధర్మవరం గడ్డకు రాజకీయ వేడి కొత్త కాదు. కానీ ఈసారి సీన్ కాస్త భిన్నం. ఒక వైపు అధికారంలో ఉన్న కొత్త నాయకత్వం.. మరోవైపు ఓడిపోయినా లక్ష ఓట్లకు పైగా సాధించిన పాత ఎమ్మెల్యే.. మధ్యలో స్థానిక సంస్థల రాజకీయాలు.. ముందుగా కనిపిస్తున్న 2029 లక్ష్యం.. సోషల్ మీడియాలో తనకంటూ ప్రత్యేక బ్రాండ్ సంపాదించుకున్న కేతిరెడ్డి. అందుకే ఇది కేవలం "గుడ్ మార్నింగ్" కాదు. ఇది ఒక రాజకీయ నాయకుడు తన పాత పలకరింపును కొత్త పోరాటానికి మార్చుకునే ప్రయత్నం. ఉదయం పలకరింపు మళ్లీ మొదలైంది. కెమెరాలు మళ్లీ ఆన్ అయ్యాయి. ప్రజల గడపలు మళ్లీ కనిపిస్తున్నాయి. పంచ్ డైలాగులు మళ్లీ వినిపించబోతున్నాయి. కానీ ఈసారి అసలు ప్రశ్న ఒక్కటే.. గుడ్ మార్నింగ్ ధర్మవరం మళ్లీ కేతిరెడ్డికి రాజకీయ గుడ్ డే తీసుకొస్తుందా? లేక ఇది కేవలం పాత బ్రాండ్‌కు కొత్త రీబూట్‌గానే మిగిలిపోతుందా? ఈ ప్రశ్నకు ధర్మవరం మాత్రమే సమాధానం చెప్పాల్సి ఉంది.




### గుడ్ మార్నింగ్ వెనుక? రాజకీయ లెక్కలేంటి?



కేతిరెడ్డి ఈ మార్పును చాలా తొందరగా పట్టుకున్న నాయకుల్లో ఒకరని ఆయన ప్రజా కార్యక్రమాల శైలి సూచిస్తుంది. "ఫ్యాక్షన్" అనే పదానికి ఉన్న పాత రాజకీయ ఇమేజ్‌ను "ఫన్"తో కలిపి సోషల్ మీడియా రాజకీయంగా మార్చడం ఆయన కమ్యూనికేషన్‌లో కనిపించే ప్రత్యేకత. కానీ రాజకీయాల్లో ఎంటర్టైన్మెంట్ ఒక్కటే సరిపోదు. పంచ్ డైలాగ్ వీడియో వైరల్ కావచ్చు. ఒక సమస్య పరిష్కారం ప్రజల మనసులో నిలిచిపోవచ్చు. ఒక మంచి ఉదయం పలకరింపు సోషల్ మీడియాలో లక్షల వ్యూస్ తెచ్చుకోవచ్చు. కానీ చివరికి ఓటరు బ్యాలెట్ ముందు నిలబడినప్పుడు అభ్యర్థి గత పనితీరు, స్థానిక సమీకరణాలు, పార్టీపై అభిప్రాయం, ప్రత్యర్థి బలం, ప్రభుత్వ పనితీరు, వ్యక్తిగత సంబంధాలు.. ఇవన్నీ కలిసే నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. 2024 ధర్మవరం ఫలితం అందుకు ఒక ప్రత్యక్ష ఉదాహరణ. లక్షకు పైగా ఓట్లు సాధించిన కేతిరెడ్డి కూడా 3,734 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అందుకే ఇప్పుడు ధర్మవరం గడ్డపై జరుగుతున్నది "గుడ్ మార్నింగ్" కార్యక్రమం కంటే పెద్దది. ఒక నాయకుడు ఓటమి తర్వాత తన పాత బ్రాండ్‌ను తిరిగి పరీక్షించుకుంటున్నాడు. ఒకప్పుడు తనను గెలిపించిన ప్రజల దగ్గరకు మళ్లీ వెళ్తున్నాడు. తన రాజకీయ శైలిని మళ్లీ ప్రజల ముందుకు తీసుకొస్తున్నాడు. అదే సమయంలో అధికారంలో ఉన్న ప్రత్యర్థిని స్థానికత, అభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రశ్నించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది తిరిగి రాజకీయ రంగప్రవేశానికి సంకేతమా? లేక ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పాత్రను బలోపేతం చేసే ప్రయత్నమా? కాలమే స్పష్టం చేయాలి. కేతిరెడ్డి జర్నీ లో ఒక వింత వ్యంగ్యం కూడా ప్రతిధ్వనించే అవకాశం ఉంది. ఉదయం "గుడ్ మార్నింగ్" చెప్పడానికి వెళ్లిన నాయకుడి ముందు ఇప్పుడు ప్రజలు ఒక ప్రశ్న వేయవచ్చు. "సార్.. గుడ్ మార్నింగ్ బాగుంది. కానీ మన రాజకీయ భవిష్యత్తు గుడ్ మార్నింగ్ అవుతుందా?" గతంలో ఆయన అధికారంలో ఉండగా సమస్య పరిష్కారానికి అధికారులను వెంట తీసుకెళ్లేవారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండగా అదే సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టాలి. అప్పట్లో ఆయన మాటకు అధికార బలం ఉండేది. ఇప్పుడు ఆయన మాటకు ప్రజా బలం ఎంత ఉందో పరీక్షించుకోవాల్సిన పరిస్థితి.

# ప్రపంచకప్‌కు ముందు జైస్వాల్‌కు కీలక పరీక్ష



2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ ఆటగాళ్లను సిద్ధం చేసుకోవాలని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. వెస్టిండీస్‌తో సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభమయ్యే వన్డే సిరీస్‌లో యశస్వి జైస్వాల్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ నాటికి బ్యాకప్ ఓపెనర్ తగినంత అంతర్జాతీయ అనుభవం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, అందుకే జైస్వాల్‌కు వరుస అవకాశాలు ఇవ్వాలని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన జైస్వాల్ 71.25 సగటుతో 285 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు ఉండగా.. అత్యధిక స్కోరు 116 నాటౌట్. ఇంగ్లండ్ వన్డేలకు దూరమైన అతడు ఇప్పుడు తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇదే సమయంలో జస్ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల్లో ఆడుతుండటంతో వెస్టిండీస్ సిరీస్‌లో ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతి లభించింది. ఈ పరిస్థితి యువ ఆటగాళ్ల సత్తా పరీక్షించేందుకు మంచి అవకాశమని ఇర్ఫాన్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌కు ముందు మిగిలే కొద్దిపాటి మ్యాచ్‌ల్లో బెంచ్ బలాన్ని పరీక్షించడం కీలకమని తెలిపాడు. వెస్టిండీస్ సిరీస్ జైస్వాల్‌తో పాటు పలువురు యువ ఆటగాళ్లకు తమను తాము నిరూపించుకునే వేదికగా మారనుంది.



### అటు షెఫాలీ.. ఇటు మంధాన

# అరుదైన రికార్డులు

ఆసియా క్రీడల సెమీఫైనల్లో భారత్ విజయం కంటే ప్రత్యేకంగా నిలిచిన అంశం షెఫాలీ వర్మ సాధించిన అరుదైన శతకమే. కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు బాదిన షెఫాలీ.. 9 సిక్సర్లు, 3 ఫోర్లతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడింది. అంతర్జాతీయ టీ20ల్లో భారత బ్యాటర్‌గా ఆమెకు ఇదే తొలి శతకం. దేశం తరఫున 118వ టీ20 మ్యాచ్ ఆడుతున్న షెఫాలీ.. భారత మహిళా క్రికెట్‌లో టీ20 శతకం సాధించిన నాలుగో బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. మరోవైపు స్మృతి మంధాన కూడా అరుదైన మైలురాయిని అందుకుంది. మహిళల టీ20ల్లో న్యూజిలాండ్ దిగ్గజం సుజీ బేట్స్ పేరిట ఉన్న 4,758 పరుగుల రికార్డును అధిగమించింది. షెఫాలీ, మంధాన తొలి వికెట్‌కు 72 పరుగుల మెరుపు భాగస్వామ్యం నెలకొల్పి బంగ్లా బౌలింగ్‌ను చీల్చిచెండాడారు. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో దూకుడు కొనసాగించింది. షెఫాలీతో కలిసి కేవలం 55 బంతుల్లో 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. ముఖ్యంగా షెఫాలీ చివరి ఓవర్ వరకు వేగం తగ్గించకుండా శతకం పూర్తి చేయడం ఇన్నింగ్స్‌కు హైలైట్‌గా నిలిచింది.



# ఆసియా క్రీడల్లో భారత్ ఫైనల్‌కు
# షెఫాలీ శతకం..

నిషిన్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు బ్యాట్–బాల్‌తో మెరుపు దాడి చేసి ఆసియా క్రీడల ఫైనల్‌కు దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ ఏకంగా 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు షెఫాలీ వర్మ విధ్వంసక శతకంతో దిశానిర్దేశం చేసింది. కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు బాదిన షెఫాలీ.. 9 సిక్సర్లు, 3 ఫోర్లతో బంగ్లా బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇది ఆమె తొలి టీ20 అంతర్జాతీయ శతకం కావడం విశేషం. స్మృతి మంధాన 37 పరుగులతో వేగవంతమైన ఆరంభం అందించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో కీలక సహకారం అందించింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ భారత బౌలింగ్ ధాటికి పూర్తిగా కుప్పకూలింది. 15.4 ఓవర్లలోనే 81 పరుగులకు ఆలౌటైంది. దిలారా అక్తర్ 27 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో నందిని శర్మ 3 వికెట్లు, దీప్తి శర్మ 3 వికెట్లు, శ్రీ చరణి 2 వికెట్లతో చెలరేగారు. బ్యాట్‌తో షెఫాలీ సునామీ సృష్టిస్తే.. బంతితో భారత బౌలర్లు బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకున్నారు.





# వైభవ్ కోసం సంజూను పక్కన పెట్టొద్దు

వైభవ్ సూర్యవంశీ సంచలన ప్రతిభ భారత క్రికెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నా.. అతడి రాకతో సంజూ శాంసన్ స్థానంపై ప్రశ్నలు తలెత్తకూడదని మాజీ భారత ఓపెనర్ అంజుమ్ చోప్రా స్పష్టం చేశారు. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌లో వైభవ్ తుది జట్టులో చోటు దక్కించుకోకపోగా, సంజూ వరుసగా రెండు అర్ధశతకాలతో తన సత్తా చాటాడు. కొత్త ప్రతిభ వెలుగులోకి వచ్చిన ప్రతిసారీ ఇప్పటికే జట్టులో స్థానం సంపాదించిన ఆటగాడిని మార్చడం సరైన విధానం కాదని అంజుమ్ అన్నారు. వైభవ్ అద్భుతమైన ప్రతిభావంతుడే అయినా.. సంజూ, అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ తమ అవకాశాలను కష్టపడి సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఆటగాళ్లపై నిరంతరం స్థానంపై అనిశ్చితి ఉండటం వారి స్వేచ్ఛను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, శ్రీ చరణి ఎదుగుదలను అంజుమ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. గత 15–16 నెలల్లో అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమె నిలకడగా రాణించిందని, ఇంగ్లండ్‌లో 10 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన ఆమె.. ప్రపంచకప్‌లో 14 వికెట్లతో మెరిసిందని తెలిపారు. ప్రతిభతో పాటు నిరంతర సాధన, నిలకడే అంతర్జాతీయ స్థాయిలో అసలైన గుర్తింపును తెస్తాయని ఆమె వ్యాఖ్యానించారు.



# మెగా ప్యారడైజ్..
## ప్రీరిలీజ్ ఫంక్షన్‌పై ఫోకస్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్‌పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'దసరా'తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ హిట్ కాంబో మరోసారి యాక్షన్ డ్రామాతో భారీ ఇంపాక్ట్‌కు సిద్ధమవుతోంది. కాయదు లోహర్, మోహన్‌బాబు, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రం భావోద్వేగాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్‌ను మేళవించిన భారీ చిత్రంగా రూపొందుతోంది. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న 'ది ప్యారడైజ్'పై ఇప్పటికే ఓవర్సీస్‌లో భారీ క్రేజ్ కనిపిస్తోంది. ప్రీమియర్ ప్రీ-సేల్స్ ఏకంగా 7 లక్షల డాలర్ల మార్క్‌ను దాటడం సినిమాపై ఉన్న ఆసక్తికి అద్దం పడుతోంది. ఇక హైదరాబాద్ శిల్పకళావేదికలో రేపు జరగనున్న గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌పై అందరి చూపు నిలిచింది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరవుతారనే ప్రచారం జోరుగా సాగుతున్నా.. అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చిరంజీవి ఎంట్రీ ఇస్తే 'ది ప్యారడైజ్' ప్రమోషనల్ బజ్ మరో స్థాయికి చేరడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ కోసం తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. రేపటి ఈవెంట్‌తో సినిమా హైప్ మరింత పీక్స్‌కు చేరే అవకాశముంది. మొత్తానికి నాని--ఓదెల కాంబో ఈసారి థియేటర్లలో ఎలాంటి పండుగ వాతావరణం సృష్టిస్తుందోనన్న ఉత్కంఠ అభిమానుల్లో పెరుగుతోంది.







# 3 నెలలు.. సినిమాలు.. విశ్వక్ సేన్ దూకుడు!

ఈ ఏడాది ఆరంభంలో 'ఫంకీ'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన విశ్వక్ సేన్‌కు ఆ సినిమా ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ ఫలితం ఇవ్వలేదు. దీంతో ఈసారి ఒక్క సినిమాతో కాదు.. వరుసగా మూడు సినిమాలతో తన జోరు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నటుడిగా మాత్రమే కాదు.. దర్శకుడిగానూ తన సత్తా చాటేందుకు తెరకెక్కించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'చకల్ట్' అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలవుతోంది. 'కల్ట్' విడుదలైన వెంటనే నవంబర్ 19న 'జుచీజు రిపీట్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ బడ్డీ కామెడీ సందడి ముగియకముందే డిసెంబర్ 4న మరో సినిమా 'లెగసీ' థియేటర్లను పలకరించనుంది. అంటే మూడు నెలలు.. మూడు సినిమాలు.. ఒకే హీరో! టాలీవుడ్‌లో ఇలాంటి వరుస విడుదలలు అరుదే కావడంతో విశ్వక్ సేన్ ప్లాన్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. అయితే వరుస సినిమాలే కాదు.. వాటి ఫలితాలే అసలు పరీక్ష. ఇటీవలి సినిమాల పరాజయాల తర్వాత ఈ మూడు చిత్రాలు విశ్వక్ కెరీర్‌కు కీలక మలుపుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా తానే దర్శకత్వం వహించిన 'కల్ట్' ఎలాంటి ప్రభావం చూపుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరం. మూడు సినిమాలకు పోటీ లేకుండా ప్రమోషన్లు నడిపించడం మరో పెద్ద సవాలే. ఈ దూకుడు ప్లాన్‌తో విశ్వక్ మళ్లీ బాక్సాఫీస్ బరిలో తన జోరు చూపిస్తాడా? వేచి చూడాల్సిందే!

# బిగ్ మూవీపై బోల్డ్ సీన్ రూమర్స్..
## తెరపై ఉంటుందా?

టాలీవుడ్‌లో ఓ భారీ చిత్రంపై వినిపిస్తున్న బోల్డ్ సీన్ రూమర్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సినిమాలో కథానాయికకు సంబంధించిన ఓ ప్రత్యేక సన్నివేశం 'యానిమల్'లో త్రిప్తి డిమ్రి పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాల తరహాలో ఉంటుందనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలకు చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. ప్రచారంలో ఉన్న కథనాల ప్రకారం.. సన్నివేశం విషయంలో కథానాయిక తొలుత కొంత సందేహం వ్యక్తం చేసినప్పటికీ, అది ఒప్పందంలో భాగంగా ఉండటంతో చివరకు చిత్రీకరణకు అంగీకరించినట్లు సమాచారం. అంతేకాదు, ఈ సన్నివేశాన్ని బాడీ డబుల్ లేకుండానే చిత్రీకరించారనే వాదన కూడా వినిపిస్తోంది. సినిమాలో ఈ సీన్ నిజంగానే ఉంటే విడుదల తర్వాత ఇది ప్రధాన చర్చాంశంగా మారే అవకాశం ఉందనే అంచనాలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే అసలు ట్విస్ట్ మాత్రం ఇంకా ముందే ఉంది. చిత్రానికి సెన్సార్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో.. చిత్రీకరించిన సన్నివేశం తుది కట్‌లో ఉంటుందా? లేక మార్పులకు గురవుతుందా? అన్నది స్పష్టంగా తెలియడం లేదు. దీంతో ప్రస్తుతం వినిపిస్తున్నవన్నీ రూమర్లుగానే మిగిలాయి. హీరోయిన్ లేదా మేకర్స్ స్పందించే వరకు అసలు విషయం తేలదు. మరి తెరపై ఏం కనిపించబోతోందో.. ప్రేక్షకులు వేచి చూడాల్సిందే!

# పేరు చెప్పేశారు.. కథపై హైప్ పెంచేశారు!

మెగాస్టార్ చిరంజీవి నోటి నుంచి సినిమా విషయాలు బయటకు రావడం అభిమానులకు కొత్తేమీ కాదు.. కానీ ఈసారి మాత్రం ఓ పాత్ర పేరు చెప్పి 'కాకా'పై క్యూరియాసిటీకి గట్టిగానే నిప్పంటించారు! దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి మరోసారి జతకట్టిన 'కాకా' సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతోంది. 2027 జనవరి 13న థియేటర్లలో సందడి చేయనున్న ఈ యాక్షన్ డ్రామాలో చిరు పాత్ర పేరు కదిరి కాళిదాస్ అని స్వయంగా వెల్లడించారు. అంతేనా.. స్టేజ్‌పై ఉన్న యాంకర్ శ్రావంతి చోకారపు స్వస్థలంతో ఈ పేరుకు సంబంధం ఉందంటూ మరో చిన్న ట్విస్ట్ కూడా ఇచ్చారు. దీంతో సినిమా కథ ఏంటి? కాళిదాస్ ఎవరు? ఈ పేరుకు శ్రావంతి ఊరితో సంబంధం ఏమిటి? అంటూ అభిమానుల మెదళ్లలో ప్రశ్నల రీల్ పరుగులు తీస్తోంది. సినిమాకు సంబంధించిన కీలక విషయాలు చెప్పకుండా ఉండాల్సిన చోట కూడా చిరు సరదాగా చిన్న లీక్ ఇచ్చేయడంతో.. మేకర్స్ ప్లాన్ చేసిన ప్రమోషన్‌కు ముందే హైప్ రెడీ అయిపోయిందనే సెటైర్లు వినిపిస్తున్నాయి. చిరంజీవితో పాటు అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంతో కేవీఎన్ ప్రొడక్షన్స్ టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. థమన్ సంగీతం అందిస్తున్న 'కాకా' షూటింగ్ అవుట్‌పుట్‌పై ఇప్పటికే పాజిటివ్ టాక్ ఉండగా.. సంక్రాంతి రేసులో అసలు ఆట ప్రమోషన్లతోనే మొదలుకానుంది!




This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108. Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717 . www.rajyasamskarana.com.